



తాళ్లపాకలోని అన్నమయ్య నివాస స్థలం వద్ద అన్నమయ్య విగ్రహం



భలే అల్లరోడే.. మహాపండితుడాయె

'చందమామ రావే.. జాబిల్లి రావే..' అమ్మ గొంతులోంచి ఈ చల్లని పాట వింటూ గోరుముద్దలు తిని పెరగని వారెవరైనా తెలుగు నేలమీద ఉంటారా.. 'జో అచ్యుతానంద.. జో జో ముకుందా.. లాలి పరమానంద.. రామగోవిందా..' అమ్మపాడే ఈ కమ్మని జోలపాట వింటూ హాయిగా నిద్రపోని బాల్యాన్ని ఊహించగలమా.. 'అదివో అల్లదివో శ్రీ హరివాసము.. పదివేల శేషుల పడగలమయము' అంటూ వేంకటేశ్వరుని స్తుతించని తెలుగువారుండరు అంటే అతిశయోక్తి కాదేమో.. ఇలాంటి వేలాది సంకీర్తనలు ఏడుకొండల వాడిపై రచించి వేంకటేశ్వరుని మహిమలను, ఏడుకొండల ఔన్నత్యాన్ని, తిరుమల విశేషాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు. నేటి నుంచి తాళ్లపాకలో అన్నమయ్య జయంతి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

- మానవతావాది.. బహుముఖ ప్రజ్ఞాశాలి
- సాంఘిక దురాచారాలపై సంకీర్తనలతో ధ్వజమెత్తిన అన్నమయ్య
- 32వేల కీర్తనలను రచించిన తొలిసంకీర్తనాచార్యులు తాళ్లపాక అన్నమాచార్యులు



అలనాటి అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక

రాజంపేట, మే 22: తెలుగు రాష్ట్రాల్లో అన్నమయ్య గురించి తెలియని వారుండరు. తొలి పదకవితా పితామహునిగా వాసికెక్కిన అన్నమయ్య చరిత్రపుటల్లో తెలుగు జాతి ఉన్నంత వరకు కీర్తింపబడుతూనే ఉంటారు. ఆయన సంకీర్తనాగానా న్ని ఎవ్వరూ మర్చిపోలేరు. అందువల్లే జిల్లాల విభజన సమ యంలో ఆయన కీర్తి చిరస్థాయిగా నిలిచిపోయేటట్లు రాజం పేట పార్లమెంటును జిల్లాను చేస్తూ అన్నమయ్య జిల్లా అని నామకరణం చేశారు. ప్రస్తుతం తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తాళ్లపాక, 108 అడుగుల విగ్రహం వద్ద ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

అన్నమయ్య చిన్నప్పుడు మహా అల్లరి పిల్లవాడట. ఎప్పుడూ ఆటలూ, పాటలే. ఇంట్లో ఎవరికీ అది నచ్చేది కాదు. వదిన మందలింపులు ఎక్కువ. ఒకసారి అన్నమయ్య ను గడ్డికోసుకు రమ్మని అడవికి పంపింది. వదినను తిట్టుకుంటూ అడవికి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా చిటికిన వేలు తెగింది. రక్తం ధారలై కారింది. వదిన ఇష్టం లేని చెప్పిందన్న కోపం... గాయం సలుపుతున్న బాధ.. అదే సమయంలో గోవిం దనామస్మరణలు ఆ అడవిలో అన్నమయ్యకు వినిపించాయి. తిరుమలకు కాలినడకన వెళ్తున్న భక్తబృందాలు కనిపించాయి. ఏడుస్తున్న బాలుడిని వారు ఓదార్చి తెచ్చుకున్న తిండిని బాలుడికి పెట్టారు. ఇంటిమీద కోపంతో ఉన్న అన్నమయ్య తిరుమలకు బయల్దేరాడు. అదే అతని తిరుమల మొదటియాత్ర.

నాటి సాంఘిక దురాచారాలపై తిరుగుబాటు

అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో ఉన్నత భావాలు, సమానత్వపు భావాలు కనిపిస్తాయి. శివుడే దైవమని వీరశైవులు, విష్ణువే దేవుడని వీరవైష్ణవులు విషం కక్కుకుంటున్న పరిస్థితి ల్లో బ్రహ్మం ఒక్కడే.. పరబ్రహ్మం ఒక్కడే అంటూ ప్రజల భావనల్లో ఏకత్వాన్ని నింపాలని ప్రయత్నించాడు. మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి ఒక్కటే.. చండాలుండేటి సరిభూ మి ఒక్కటే.. అని కులవివక్ష తగదని ప్రబోధించాడు. వేదాలు పఠించిన వారు గొప్పవారు కాదని, ఆచరించిన వారే ఉన్నతు లని పేర్కొన్నారు. భూమిని దళితుడూ తాకుతున్నాడు బ్రాహ్మ ణుడూ తాకుతున్నాడు... భూమికి ఈ తేడా లేనప్పుడు మాన వులకు కులమతాల తేడా ఎందుకని తన పదకవితల ద్వారా కులమతాలకు వ్యతిరేకంగా పదునుపెట్టాడు. భగవంతునికి సర్వం సమానమని చాటాడు. తన కీర్తనల్లో ఆనాటి జాన పదాలను పొందుపరిచారు. సువ్వి పాటలు, నేరెళ్ల, గొబ్బిపా టలు, సోది, కోలాటం, పెళ్లి, భోజనం ఇలా ఎన్నో సందర్భాల్లో జానపదులు వాడే పదాలు అన్నమయ్య కీర్తనల్లో కనిపిస్తాయి.

శ్రీవారి ఆలయంలో హుండీ పెట్టింది అన్నమయ్యే

నేడు వేలకోట్ల రూపాయలు శ్రీవారికి కానుకలు వచ్చే అత్యంత ప్రధాన ఆదాయ వనరు హుండీ. దానిని తిరుమలలో పెట్టింది అన్నమయ్యే. అన్నమాచార్యులు అలనాడు శ్రీవారి ఆలయంలో పెట్టిన హుండీ ద్వారా నేడు ఏడాదికి కనీసం వెయ్యికోట్లు వస్తోంది.

సాహితీ సంపన్నులు అన్నమయ్య వంశీయులు

ఆబాల గోపాలాన్ని తన కీర్తనలతో అలరించిన అన్నమయ్య చరిత్రలోనే గొప్ప పండితుడు. తొలితెలుగు వాగ్గేయకారుడు. ఆయనతో పాటు ఆయన వారసులందరూ సాహితీ సంపన్నులే. అన్నమాచార్యుల మొదటి భార్య తిమ్మక్క సరస్వతీ మూర్తి. ఈమెను తిరమలాంబ అనేవారు. ఆమె సుభద్ర కల్యాణాన్ని రచించారు. అన్నమాచార్యుల రెండో భార్య అక్కమాంబ. ఆమె కుమారుడు తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యులు శృంగారవృత్తశతకం, చక్రవాక మంజిరి రచించారు. తండ్రి అన్నమయ్య కీర్తనలను రాగిరేకులపై లిఖింపజేసి భద్రపరచడంలో ఈయన కృషి ప్రశంసనీయం. ఈయన వేల కొలది కీర్తనలు రాసారు. అనేక శతక, రగడలు, సప్తమాలు, దండకాలు రచించాడు. అన్నమయ్య, తిరుమలాంబ కుమారుడు తాళ్లపాక నరసింగన్న. ఇతనిని నరసయ్య, సరసింహాచార్యులు అని పిలిచేవారు. ఈయన రచనలు వెలుగులోకి రాకపోయినా ఈయన ప్రతిభను గురించి తెనాలి రామకృష్ణుడు తనకవిత్వంలో అనేక చోట్ల ప్రస్తుతించారు. అన్నమాచార్యుల మనుమడు తిరుమలయ్య సంగీత సాహిత్యాలలో ఆరితేరిన వాడు. ఆధ్యాత్మిక, శృంగార కీర్తనలు అనేకం రచించాడు. తాళ్లపాక తిరువెంగళనాధుడు అన్నమాచార్యుల నాల్గవ కుమారుని బిడ్డ. ఈయనను చిన్నప్ప అని పిలిచేవారు. ఈయన అన్నమచార్య చరిత్ర, అష్టమంజరికల్యాణం, పరమయోగి విలాసం, ఆశాపరిణయం అనే కావ్యాలు రచించారు. తాళ్లపాక చిన్నతిరుమలయ్య కుమారుడు తిరువెంగళప్ప వ్యాఖ్యలు రాయడంలో పేరుగడించారు.

తాళ్లపాకలో ఒక్కరూ లేరు

వేంకటేశ్వరస్వామి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన తాళ్లపాక అన్నమాచార్యుల వంశం వారిలో ప్రస్తుతం తాళ్లపాకలో ఒక్క కుటుంబం కూడా లేదు. ఆ వంశానికి చెందిన ఒక్క పూరిపాకకూడా లేదు. కేవలం వారి ఇంటి పునాదుల వద్ద అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. గ్రామంలో ఎటువంటి జీవనభృతి లేకపోవడంతో ఆ వంశానికి చెందిన 11వ తరం వారంతా తిరుమలకు వెళ్లిపోయారు. వారికి తిరుమలలో శ్రీ వారి ఆలయానికి పక్కనే గతంలో ఓ ఇల్లుండగా, మాడవీధుల ఆధునీకరణలో ఆ ఇంటిని కూడా తొలగించి వేశారు. ప్రస్తుతం ఆ కుటుంబీకులు ఒక్కరంటే ఒక్కరూ తాళ్లపాక పరిసర ప్రాంతాలలో లేరు. చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురైపోయారు. 11వ తరానికి చెందిన ఈ కుటుంబీకులు హరినారాయణాచార్యులు, సత్యనారాయణాచార్యులు ప్రస్తుతం తిరుమలలో ఉంటూ శ్రీవారి మేలుకొల్పు, ఏకాంతసేవలు నిర్వహిస్తున్నారు. 11తరాలుగా శ్రీవారికి అన్నమయ్య కుటుంబం ఈ సేవలు నిర్వహిస్తోంది. రాఘవాచార్యులు న్యాయవాదిగా హైదరాబాద్‌లో ఉన్నారు. ఆ వంశానికి చెందిన మీనా, సులోచన కూడా తిరుమలలో ఉన్నారు. అన్నమయ్య వారసుల్లో సత్యనారాయణాచార్యుల కుమార్తె సంగీతంలో ఎంఏ పూర్తి చేశారు. ఈమె అన్నమాచార్య ప్రాజెక్టులో గాన కళాకారిణిగా ఉన్నారు.

తెలుసుకుందాం


అన్నమయ్య రాసిన మొత్తం కీర్తనలు : 32,000
లభ్యమైన కీర్తనలు : 14,351
108 అడుగుల విగ్రహం ఏర్పాటుచేసిన సంవత్సరం : మే, 2008
108 అడుగుల విగ్రహ శిల్పులు : దేవరకొండ పెంచలయ్య, సూరిబాబు
108 అడుగుల విగ్రహం ఏర్పాటుకు వాడిన సామాగ్రి : 105 టన్నుల స్టీలు, 15వేల సిమెంటు బస్తాలు, 500 యూనిట్ల ఇసుక, 500 యూనిట్ల మెటల్, 150 మంది శిల్పులు, రూ.3.02కోట్లు ఖర్చు
ప్రస్తుతం తాళ్లపాక వంశం : 11వ తరం



తిరుమల శ్రీవారి ఆలయంలో ఉన్న అన్నమయ్య సంకీర్తనా భాండాగారపు గది



రాగిరేకులపై అన్నమయ్య రచించిన కీర్తనలు



తిరుమలలో శ్రీవారి మాడ వీధులలో గతంలో ఉన్న అన్నమయ్యవంశీయుల స్వగృహం (ప్రస్తుతం కూల్చేశారు)



తాళ్లపాక ముఖద్వారం వద్ద అన్నమయ్య 108 అడుగుల విగ్రహం

నేటి నుంచి అన్నమయ్య జయంతి మహోత్సవాలు

తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు 23వ తేదీ గురువారం నుంచి 25వ తేదీ శనివారం వరకు తాళ్లపాక లోని అన్నమయ్య ధ్యానమందిరం, అన్నమయ్య 108 అడుగుల విగ్రహం జరగనున్నాయని తాళ్లపాక ఆలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లపాక ధ్యానమందిరంలో గురువారం ఉదయం 10.30గంటలకు శ్రీనివాస కల్యాణం జరగనుంది. అంతకముందు గోష్టిగానం, సప్తగిరి సంకీర్తనలు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు సంకీర్తన సభ, 7గంటలకు హరికథ నిర్వహించనున్నారు. అదే రోజు 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద సాయంత్రం 6.30గంటలకు ఊంజల సేవ ఉంటుంది. తిరుపతికి చెంది న నారాయణస్వామి, నాగలక్ష్మీ బృందం శ్రీవారి సంకీర్తన లు, సాయంత్రం 7.30గంటలకు హరికథ గానాన్ని ఆలపించనున్నారు. 24న శుక్రవారం తాళ్లపాకలో సాయంత్రం 6గంటలకు సుబ్రమణ్యం, దేవిక బృందంచే సంగీత సభ, సాయంత్రం అనసూయ బృందం హరికథ నిర్వహించను న్నారు. ఆదేరోజు 108అడుగుల విగ్రహం వద్ద సాయంత్రం 6గంటలకు శ్యామ్‌కుమార్, తులసీరామ్ బృందం సంకీర్తన సభ, 25న ఉదయం తిరుపతికి చెందిన రవిచంద్ర, మొనాలిస బృందం సంగీత సభ, సాయంత్రం 7గంటలకు తిరుపతి మాధవి బృందం సంగీత సభ నిర్వహించనున్నారు. ఆదేరోజు అన్నమయ్య విగ్రహం వద్ద బోయనపల్లె భజన మండలి బృందంచే కోదండరామ కళానాట్య మండలి నాటకం ప్రదర్శించనున్నారు.

ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

అన్నమయ్య జయంతి ఉత్సవాల సందర్భంగా టీటీడీ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల కోసం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారు విద్యుత్ దీపాలను, కటౌట్లను, స్వాగత తోరణాలను, చలువ పందిళ్లను ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం తాళ్లపాకలో శ్రీనివాస కల్యాణం, సాయంత్రం 108 అడుగుల విగ్రహం వద్ద ఊంజలసేవ జరగనున్న సందర్భంగా అక్కడ అన్ని ఏర్పాట్లు చేశారు.



తాళ్లపాకలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

శభాష్.. తిప్పేస్వామి

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి
- తన వాహనంలోనే ఆస్పత్రికి తరలింపు
- ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ములకలచెరువు, మే 22: ములకలచెరువు ఎస్ఐ తిప్పేస్వామి మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని తన వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళితే...ములకలచెరువు మండలం పర్తికోట పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా బి.కొత్తకోటకు ద్విచక్రవాహనంలో వెళ్తూ అక్కడ పనులు చేస్తూ ప్రతిరోజూ స్వగ్రామానికి వస్తున్నాడు. ప్రతిరోజూ లాగే పని ముగించుకుని మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గంమధ్యంలోని పెద్దపాళ్యం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడడంతో పాటు కాలు విరిగి రక్తపు మడుగులో పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిప్పేస్వామి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని 108కు సమాచారం అందించారు. వాహనం అందుబాటులో లేకపోవడం రావడానికి గంట సమయం పడుతుందని సమాధానం రావడంతో వెంటనే తన వాహనంలో క్షతగాత్రుడిని ఎక్కించుకుని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడారు. అత్యవసర సమయంలో ఇతర వాహనం కోసం వేచి చూడకుండా తన వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్న ఎస్ఐ తిప్పేస్వామిని పలువురు అభినందించారు.



తన వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

గౌరవ వేతనం ఎప్పుడిస్తారో?

- ఏడాది నుంచి బీఎల్‌వోల ఎదురుచూపులు
- పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఖర్చులూ ఇవ్వలేదు
- జిల్లాలోని 1320 మంది బీఎల్‌వోల ఆవేదన



మదనపల్లె టౌన్, మే 22: సార్వత్రిక ఎన్నికలంటే ఈ వ్యవస్థకు పునాదులు లాంటి వారు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు). గ్రామ, వార్డు సచివాలయాల్లోని సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ మహిళా పోలీసులు, వీఏఏలు తదితర అందరు సిబ్బందిని బీఎల్‌వోలుగా నియమించారు. అటువంటి బీఎల్‌వోలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవవేతనం బకాయిలు పెంచుకుంటూ పోతుందే కాని, మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.500 చొప్పున ప్రతి బీఎల్‌వోకు మూడు నెలలకు ఒకసారి వారి బ్యాంకు ఆకౌంట్లలో జమ చేసే గౌరవ వేతనం ఏడాది నుంచి ఇవ్వడం లేదు.

ఏడాదిగా అందని గౌరవ వేతనం

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో సుమారు 1320 మంది బీఎల్‌వోలు సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. వీరందరికీ ఆరు నెలలుగా రిటర్నింగ్ అధికారులు సమావేశాలు నిర్వహించి పలు రకాల సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల వస్తున్నాయి...ఇంటింటికి తిరగండి, కొత్త ఓటరు నమోదు నుంచి చిరునామా మార్పులు, పేర్లలో తప్పిదాలు, తొలగింపులు, చేర్పులు సక్రమంగా నిర్వహించండి. ఏదైనా తప్పులు, లోపాలుంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో)లను ఆరు నెలలుగా హెచ్చరించారు. ఈ క్రమంలో జిల్లాలోని సుమారు 1320 మంది బీఎల్‌వోలు ఎండనకా, వాననకా ప్రతి ఇంటి గడప తొక్కుతూ, రాజకీయ పార్టీల నాయకుల ఒత్తిళ్లను అధిగమించి విధులు నిర్వహించారు. ఇంత కష్టం చేసినా వారికి ప్రభుత్వ ఇచ్చే గౌరవవేతనం ఏడాదిగా బకాయి పడింది. ఒక బీఎల్‌వోకు నెలకు రూ.500 గౌరవవేతనం ఇవ్వాల్సి వుంది. వీటిని మూడు నెలలకు ఒకసారి రూ.1500 చొప్పున బీఎల్‌వోల అకౌంట్లులో జమ చేస్తారు. కాని ఏడాదిగా చాలా మంది బీఎల్‌వోలకు గౌరవ వేతనం అందలేదు.

ఏర్పాట్ల ఖర్చులు భారం

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోని 1320 పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు, ర్యాంపులు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వసతులను బీఎల్‌వోలు దగ్గరుండి చేయించి భారం చేశారు. అంతేకాకుండా పోలింగ్‌కు ముందురోజు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఆరుగురు పోలింగ్ అధికారులు, భద్రతా సిబ్బంది, పోలీసులు తదితరులకు భోజనాలు, టీ, స్నాక్స్ ఏర్పాటు చేశారు. దీనికోసం ఎన్నికల సంఘం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (తహసీల్దార్/మున్సిపల్ కమిషనర్) ద్వారా నిధులు పంపిణీ చేయాల్సి ఉంది. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో తహసీల్దార్లే పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహించి పోలింగ్ అధికారులు, పోలీసులకు భోజనం, టీ, స్నాక్స్ అందజేశారు. కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం బూత్ లెవెల్ అధికారులే ఏర్పాటు చేయాలని, వాటికి అయిన ఖర్చులు ఇస్తామని ఏఆర్‌వోలు చెప్పారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. వీటికి ఎంత లేదన్నా రూ.3 నుంచి రూ.4 వేలు ఖర్చు అయి ఉంటుంది. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో కొంతమంది ఏఆర్‌వోలు ఈ ఖర్చులన్నీ భరించారు. కానీ మదనపల్లె మండలం, తంబళ్లపల్లె మండలాల్లోని బీఎల్‌వోలకు చేతిచమురు వదిలింది. కేవలం రూ.1000 నుంచి రూ.3000 మాత్రమే ఏఆర్‌వోలకు, బీఎల్‌వోలకు ఇచ్చారు. ఎన్నికలు పూర్తయి నేటికి 10 రోజులు అవుతున్నా, ఏఆర్‌వోలు బీఎల్‌వోలపై కనికరం చూపడం లేదు.

బీఎల్‌వోలకు బకాయిలు చెల్లిస్తాం..

ఎన్నికల విధుల్లో పాల్గొన్న బీఎల్‌వోలకు చాలా వరకు బిల్లులు చెల్లించాము. కొందరికి మాత్రం ఖర్చులను లెక్కించి ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ఏఆర్‌వోల ద్వారా బీఎల్‌వోలకు సొమ్ములు చెల్లిస్తాం. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద ఖర్చు వివరాలను సేకరించాము. వీటిని ఉన్నతాధికారులకు పంపి, ఉత్తర్వులు వచ్చిన వెంటనే బకాయిలు చెల్లిస్తాం.

- హరిప్రసాద్, రిటర్నింగ్ అధికారి, మదనపల్లె

కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు



రాయచోటిటౌన్, మే 22: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కర్నూలు డీఐజీ సీహెచ్ విజయరావు ఎస్పీలను ఆదేశించారు. బుధవారం ఆయన కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాటిల్స్‌లో పెట్రోల్ పట్టకూడదని పెట్రోల్ బంకులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అక్రమంగా బాణాసంచా నిలువలు లేకుండా తనిఖీలు నిర్వమించాలని ఆదేశించారు. అందరూ టీం వర్క్‌తో బాగా పనిచేయాలని, కౌంటింగ్ వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేలా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, కమాండ్ కంట్రోల్ నుంచి పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కేవలం ఏజెంట్లు, అభ్యర్థులు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీ నుంచే ప్రతి జిల్లాల సరిహద్దు ప్రవేశం, నిష్క్రమణల దగ్గర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి ఎస్ఐ అధికారిని, అబ్జర్వేషన్ అధికారిని కేటాయించాలని, ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ బిక్షపారావు, పలువురు డీఎస్పీలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి (కలెక్టరేట్), మే 22: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆర్డీవోలు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాల ప్రకారమే ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. జూన్ 4న కౌంటింగ్ హాల్‌లో జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణ తరగతులు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వాలన్నారు. రౌండ్‌ల వారీగా ఫలితాలు సక్రమంగా ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సత్యనారాయణ, ఆర్డీవోలు, నోడల్ అధికారులు, ఎలక్షన్ అధికారులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో మాండవ్యనది

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న వైనం
- పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ అధికారులు
- నదికి ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలంటున్న స్థానికులు



గాలివీడు రోడ్డులో బ్రిడ్జి వద్ద మాండవ్యనదిని ఆక్రమించి వేసిన రోడ్డు

రాయచోటి టౌన్, మే 22: రాయచోటి పట్టణంలోని పాత రాయచోటిని-రాయచోటి మధ్య ప్రవహిస్తున్న మాండవ్యనది కబ్జాదారుల కబంధహస్తాల్లో చిక్కుకుని రోజురోజుకు కుంచించుకుపోతోంది. నదికి ఇరువైపులా ఆక్రమణలు పెరుగుతుండడంతో రోజు రోజుకు నది విస్తీర్ణం తగ్గిపోతోంది. దక్షిణకాశీగా పిలవబడే భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం నిర్మాణం కాక పూర్వం మాండవ్య మహాముని తపోబలం చేత మాండవ్యనది ఏర్పడిందన్నది ఈ ప్రాంత చరిత్ర, శాసనాల ద్వారా తెలుస్తోంది.

అలాంటి పవిత్రమైన మాండవ్యనది నేడు ఆక్రమణలకు గురి కావడమే కాకుండా మురికినీటికి నిలయంగా మారి కంపుకొడుతోంది. ఒకప్పుడు వీరభద్రస్వామి ఆలయానికి వచ్చే భక్తులు మాండవ్య నదిలో స్నానమాచరించి భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకునేవారు. అలాంటి నదిపై అటు మున్సిపల్ అధికారులు ఇటు రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ చేపట్టకుండా గాలికి వదిలేయడంతో కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పట్టణ పరిధిలోని కంచాలమ్మ గండి చెరువు నుంచి దిగువ అబ్బవరం వరకు మాండవ్యనది పలుచోట్ల కబ్జాకు గురై నది విస్తీర్ణం తగ్గడమే కాకుండా ఇక్కడ మాండవ్యనది ఉందా అన్న అనుమానం కూడా పట్టణ ప్రజల్లో కలుగుతోంది.

ముఖ్యంగా మాండవ్యనదిలో గాలివీడు మార్గంలోని బ్రిడ్జి వద్ద నదిని దర్జాగా ఆక్రమించి కబ్జాదారులు రోడ్డు కూడా వేశారు. అంతేగాక మాసాపేట సమీపంలోని బ్రిడ్జి వద్ద సుమారుగా ఎకరాకు పైగా మాండవ్యనది స్థలాన్ని ఆక్రమించి షెడ్లు వేసి దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనికి తోడు రింగు రోడ్డు సమీపంలోని దిగువ అబ్బవరం- చెన్నముక్కపల్లెకు మధ్యలో గల బ్రిడ్జి వద్ద కొంత మంది కబ్జాదారులు మాండవ్యనదిని ఆక్రమించి చదును చేసి పంటలు సాగు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. అంతేగాక నదికి ఇరువైపులా చాలామంది నది స్థలాన్ని ఆక్రమించి పలుచోట్ల నిర్మాణాలు చేపట్టి నివాసయోగ్యాలుగా వినియోగించుకుంటున్నారు. పూర్వకాలం నుంచి ఒక ప్రత్యేకత సంతరించుకుని అత్యంత పవిత్రంగా ఉన్న మాండవ్య నదిని కబ్జా కోరల నుంచి కాపాడి నదికి ఇరువైపులా రక్షణ గోడ ఏర్పాటు చేసి భవిష్యత్తులో మాండవ్యనది కబ్జాకు గురకాకుండా కాపాడాలని నదీ పరివాహక ప్రాంత ప్రజలతో పాటు రాయచోటి పట్టణ ప్రజలు, కన్నడ భక్తులు కోరుతున్నారు.



మాండవ్య నదిలో ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజ్



పాతరాయచోటి వద్ద మురికినీటితో నిండి ఉన్న మాండవ్యనది

మాండవ్య నదిలో రేకుల షెడ్లు వేసి గోడౌన్లుగా వినియోగిస్తున్న దృశ్యం



పులివెందులలో జర్మనీ బృందం



ప్రకృతి వ్యవసాయ పొలాన్ని పరిశీలిస్తున్న జర్మనీ బృందం

పులివెందుల, మే 22: ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జర్మనీ కేఎఫ్ డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. పులివెందుల నియోజకవర్గంలోని తొండూరులో రమేశ్ అనే రైతు శాస్త్రవేత్త పొలాలను పరిశీలించారు. తన వ్యవసాయ క్షేత్రంలో ఒక ఎకరా విస్తీర్ణంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పచ్చిరొట్ట ఎరువులను ఎ-గ్రేడ్, ఏటీఎం నమూనాలను అవలంభిస్తున్నాడు. రైతు సాధికార సంస్థ ఆదేశానుసారం 80 సెంట్ల విస్తీర్ణంలో ఎ-గ్రేడ్, 20 సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం మోడల్స్ వేసి మంచి దిగుబడి సాధిస్తున్నారు. రమేశ్ అనుసరిస్తున్న రెండు నమూనాలను బృంద సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి పంట విధానాలను, పురుగు, తెగుళ్ల నియంత్రణకు అనుసరిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఆగ్రో ఎకాలజీ అంతర్జాతీయ స్థాయి పరిశోధన కోసం పులివెందులలో నెలకొల్పిన ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఇన్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ (ఐజీగార్ల్)లో నాలుగు రోజుల పాటు జరగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జర్మనీ బృందం వచ్చింది. ఇందులో భాగంగా జర్మనీకి చెందిన కేఎఫ్ డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందం సభ్యులు ఐరిష్, మాథియాస్, మార్క్, సంగీతలు వ్యవసాయ క్షేత్రాన్ని పరిలించి రైతు అనుసరిస్తున్న పద్ధతులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఐజీగార్ల్‌లో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లతో సమావేశమై అకాడమీలో నిర్వహిస్తున్న కోర్సు విధివిధానాలు, ఫీల్డ్‌లో అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్, సీనియర్ సలహాదారులు (ఇంటిగ్రేషన్) మురళీధర్, థిమాటిక్ లీడ్‌లు సుధాకర్, డాక్టర్ విజయ్ సందీప్, ఐజీగార్ల్ ఏఓ శివారెడ్డి, సలహాదారులు డాక్టర్ కేఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

గుండెపోటుతో గండికోట నిర్వాసితుడు మృతి

కొండాపురం, మే 22 : గండికోట ముంపు పరిహారం కోసం కలెక్టర్‌ను కలిసేందుకు వెళుతూ మార్గమధ్యంలో వల్లపు వెంకట కొండయ్య (58) అనే నిర్వాసితుడు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు కొండాపురం పట్టణానికి చెందిన పలువురు నిర్వాసితులు ముంపు పరిహారం కోసం కలెక్టర్‌ను కలిసేందుకు బుధవారం కొండాపురం నుంచి రెండు వాహనాలలో కడపకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో వారితో పాటు వెళ్లిన కొండయ్య కమలాపురం వెళ్లాక గుండెపోటుకు గురయ్యాడు. దీంతో కమలాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందినట్లు తోటి నిర్వాసితులు తెలిపారు. కాగా కొండయ్యకు గండికోట పునరావాసం కింద పరిహారం అందలేదు. వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం విడుదల చేస్తూ జీవో విడుదల చేసినా ఇంతవరకు నిధులు విడుదల చేయలేదు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో పరిహారం వెంటనే ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌ను కలిసేందుకు వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. కొండయ్యకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలుకింద పడి యువకుడు మృతి

వల్లూరు, మే 22 : కమలాపురం పట్టణం, పాపాఘ్నినది బ్రిడ్జిపై రైలుకింద పడి పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన మల్లికార్జున (17) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు గమనించి వెంటనే కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ క్షతగాత్రుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడి తల్లిదండ్రులు కొద్దిరోజుల క్రితమే బలవన్మరణం చెందడంతో మృతుడు వల్లూరు మండలం తప్పెట్ల గ్రామంలో తన బంధువు వద్ద ఆశ్రయం పొందుతున్నట్లు సమాచారం. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

వైభవంగా భువనగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

రాజంపేట, మే 22 : రాజంపేట మండలం భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండు రోజులుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బుధవారం నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారిని వెండి కవచ దారణతో అలంకరించారు. హనుమద్ వాహనంపై స్వామిని ఊరేగించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో నరసింహస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భువనగిరి నరసింహస్వామికొండను, ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలంకణతో అలంకరించి ప్రత్యేక స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హంసవాహనంపై వెంకటేశ్వరస్వామి



హంసవాహనంపై ఊరేగుతున్న స్వామి

జమ్మలమడుగు, మే 22: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం మూడవ రోజు ఉదయం 8 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి చిన్నశేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. పలువురు భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. ఉదయం 10.30 గంటలకు స్వామి వారి స్నపన తిరుమంజసం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనారాపురం వెంకటేశ్వరస్వామి ఊంజల్ సేవ పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు సందర్శించి పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు అన్నమాచార్య కీర్తనలు, 8 గంటలకు హంసవాహనంపై ఊరేగింపు చేశారు. రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు జమ్మలమడుగు, మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెంది న మహిళా భక్తులు కోలాటం నిర్వహించారు.

వేంపల్లెలో మట్టి తరలింపుపై వివాదం

- మా భూముల్లో నుంచి మట్టి తరలించవద్దు
- లీజు ఉన్న చోటే తీసుకెళ్తున్నాం : వైసీపీ నేతల వాగ్వాదం





మట్టి తరలింపుపై వాదించుకుంటున్న వైసీపీ నేతలు భారతి, ఓబులేసు - మట్టి తరలించడంతో కరిగిపోయిన కొండ

వేంపల్లె, మే 22: వేంపల్లెలో మట్టి తరలింపుపై వివాదం తలెత్తింది. వైసీపీ నాయకుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మా భూముల్లో మట్టి తోలవద్దంటూ ఎస్సీ కాలనికి చెందిన వైసీపీ నాయకుడు ఓబులేసు మట్టిని తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకున్నారు. లీజు ఉన్న చోటనే మట్టిని తరలిస్తున్నామంటూ వైసీపీ నాయకురాలు ఎంపీటీసీ భారతి చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. సీఐ చాంద్‌బాష దృష్టికి సమస్య వెళ్లడంతో మట్టి తరలింపు నిలిపివేయించారు. వేంపల్లెలో బుధవారం జరిగిన ఈ మట్టి తరలింపు వివాదం వివరాలు ఇలా ఉన్నాయి.

స్థానిక వైసీపీ మహిళా నాయకురాలు ఎంపీటీసీ భారతి మట్టి తరలింపునకు లీజు తీసుకుంది. పాములూరు రోడ్డు వైపున మట్టిని తరలించేందుకు జేసీబీ, ట్రాక్టర్లను తీసుకెళ్లింది. దీనిపై ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు ఓబులేసు మట్టి తరలింపును అడ్డుకున్నారు. మా భూములు ఇవి ఎందుకు మట్టిని తరలిస్తున్నావంటూ అభ్యంతరం తెలిపారు. లీజు ఉన్న చోట మట్టిని తీసుకెళ్తున్నాం. ఎందుకు అడ్డుకున్నావంటూ ఇరువురు వాదోపవాదానికి దిగారు. సమస్య సీఐ చాంద్‌బాష దృష్టికి వెళ్లింది.

వెంటనే మట్టి తరలింపు పనులు నిలిపివేయాలని తహసీల్దార్ వద్ద హద్దులు నిర్ణయించుకున్న తర్వాతే తరలించుకోవాలని సూచించడంతో అక్కడ నుంచి జేసీబీ, ట్రాక్టర్లను వెనక్కి తీసుకెళ్లారు. వేంపల్లెలో మట్టి యధేచ్ఛగా తరలిపోతుందన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ వివాదం జరగడం చర్చనీయాంశమైంది. లీజు ఉన్న వారికి హద్దులు గుర్తించి అధికారులు వేయించాలరు. అక్కడ నుంచే నిబంధనల మేరకు మట్టి తరలించేలా అధికారులు తరచూ పర్యవేక్షణ చేస్తే ఇలాంటి వివాదాలను నివారించవచ్చు. ఆ దిశగా రెవిన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండలాలకు పాఠ్యపుస్తకాల తరలింపు



పాఠ్యపుస్తకాల వాహనాన్ని జెండా ఊపి తరలిస్తున్న డీఈవో అనురాధ

కడప (ఎడ్యుకేషన్), మే 22: ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు మండలాలకు తరలిస్తున్నట్లు డీఈవో అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని బుక్స్ గోడౌన్ నుంచి మండలాలకు బస్సు ద్వారా పాఠ్యపుస్తకాలను తరలించారు. డీఈవో జెండా ఊపి ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 12,57,465 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా.. మొదటి విడతగా 5,70,953 పాఠ్యపుస్తకాలు వచ్చాయని తెలిపారు. 6,86,512 పాఠ్యపుస్తకాలు ఇంకా రావాల్సి ఉందన్నారు. కడప జిల్లాకు సంబంధించి గోపవరం, బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.మఠం మండలాలకు 38,842 పాఠ్యపుస్తకాలు పంపించామన్నారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలకు 30,924 పాఠ్యపుస్తకాలు పంపించామన్నారు. బుక్స్ గోడౌన్ మేనేజరు జి.రామాంజులదేవి, డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



ప్రవీణ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

బ్రహ్మంగారిమఠం, మే 22: వ్యవసాయం చేస్తూ, సరైన వర్షాలు లేక.. పంటలు సరిగా పండక, పండినా గిట్టుబాటు ధరల్లేక అప్పుల బాధతో ఓ యువరైతు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన బి.మఠం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు..

బ్రహ్మంగారిమఠం మండలంలోని చౌదరివారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ఎం.ప్రవీణ్ కుమార్ (34) డిగ్రీ వరకు చదువుకున్నాడు. కొంతకాలం ప్రైవేటు ఉద్యోగం చేశాడు. జీతం సరిపోక పోవడంతో ఆ ఉద్యోగం మానేసి తండ్రితో కలసి వ్యవసాయం చేయడం మొదలు పెట్టాడు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఐదెకరాలు పొలం కౌలుకు తీసుకుని వరి, మొక్కజొన్న పంటలు సాగుచేశాడు. వర్షాలు సక్రమంగా లేక పంటల దిగుబడి సరిగా లేదు. దీనికి తోడు గిట్టుబాటు ధరలూ లేవు. దీంతో పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా రాక పోవడంతో రూ.6లక్షలకు పైగా అప్పులయ్యాయి. వడ్డీలు పెరుగుతుండటంతో తీర్చేమార్గం లేక మనస్తాపానికి గురైన ప్రవీణ్‌కుమార్ సోమవారం పురుగులమందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. గమనించిన భార్య అనిత గ్రామస్థుల సాయంతో హుటాహుటిన ఓ ప్రైవేటు వాహనంలో సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొదుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. బుధవారం మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి ఒక భార్యతో పాటు మూడుసంవత్సరాలు, సంవత్సరం వయసున్న ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. చిన్నవయసులోనే ఆత్మహత్యకు పాల్పడ్డంతో చౌదరివారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పుల బాధతో అకాల మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మృతుని తండ్రి దేవరాజ్ ఫిర్యాదు మేరకు సిద్దవటం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నమో.. నారసింహా!

- కొండకోనల్లో మారుమోగిన గోవింద నామస్మరణ
- ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం
- వైభవంగా సింహ గరుడవాహన సేవలు



సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్న పెంచలకోన నరసింహస్వామి


రాపూరు(డక్కిలి), మే 22 : కొండాకోనా ఎటు చూసినా కనుచూపు మేర భక్తులే భక్తులు.... ఎవరినోట విన్నా పెంచలో ...పెంచలా... గోవిందా...గోవిందా... నమో.. లక్ష్మీ నారసింహ... అనే నామ స్మరణే. భక్త కోటి పిలుపుతో పెనుశిల నరసింహుడు పరవశించిపోయాడు. పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వర్ణమయ కాంతులతో మెరిసి పోతున్న గరుద్మంతుడిపై నరసింహస్వామి కొలువుదీరి భక్తులను కటాక్షించాడు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగి తేలారు.

● కిక్కిరిసిన కోన

రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో పెంచలకోన క్షేత్రం కిక్కిరిసిపోయింది. ముందుగా పలువురు భక్తులు తలనీలాలు సమర్పించుకుని, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు వివిధ సత్రాల్లో అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో జనం తరలి రావడంతో కోనలో ఈ ఏడాది వ్యాపారాలు ఊపందుకొన్నాయి. కాగా పెంచలస్వామి బుధవారం ఉదయం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార మండపంలో సింహవాహనాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను కొలువు దీర్చారు. అర్చకుల విశేష పూజల అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం,విశేష పూజలు, హోమాలు కొనసాగించారు. రాత్రికి స్వామివారిని తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించారు. ఉభయ దేవరులతో కలిపి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వర్ణ గరుడుడిపై స్వామి వారు కోనలో మూడ వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీ కే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్‌స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధుస్వామితో పాటు టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.

● నేడు కల్యాణం

కోనలో గురువారం ఉదయం శ్రీవారి కల్యాణం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. రాత్రి 6 గంటలకు రథోత్సవం, అనంతరం గజవాహన సేవలు నిర్వహిస్తారు.



WANTED

కడప నగరంలో ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు క్యాషియర్-02, క్యాప్టెన్స్-02, కిచెన్ సూపర్‌వైజర్స్-02 (Experience / Freshers) All Post Experience People are preferable, Cont: 90525 10778
Ajc-188570

10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, P.G, B.Tech., MBA, M.Tech. పాసయ్యేచాన్స్ కలదు. నగేష్ అకాడమి, కడప. సెల్ : 7569470023
Ajc-188574

పాసుపోర్టు పోయినది

పేట దీనూర్ రహమాన్, కొత్తపల్లి విలేజ్, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియన్ పాసుపోర్టు నెం. V9366262, ఇంటి నుండి జిరాక్స్ నిమిత్తం బైక్‌లో వెళ్తుండగా పెనగలూరు బస్టాండ్ నందు పోయినది. దొరికినవారు అందజేయగలరు.
Ajc-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 177000

WANTED TEACHERS

QUALIFIED TEACHERS to Work from Pre-Primary, Primary and High School. Address : T.K.R. Jeevan Jyothi High School, Jammalamadugu, Contact : 96037 37014
AJC-188704

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్ : 90105 01122.
Ajc-188573

LOSS OF PASSPORT

I SHAIK ISMAIL S/o Shaik Khadar Valli, D.No. 6/154-3, Burendeen Street, Kadapa City, YSR Dist, A.P. The said Passport was lost by me while I was Going to Xerox copies at Rajakhanbhag masid Near 2nd Gandhi statue Kadapa. My Passport No.R7216788. Cont : 96763 15951.
AJC-188575

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

రామాపురం, మే 22: ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ్ బాబు హెచ్చరించారు. బుధవారం సుద్దమళ్ల పంచాయతీ దూదేకులపల్లెలో ప్లాగ్ మార్చ్, కల్పనాయునిచెరువు గ్రామంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రాబోయే ఎన్నికల ఫలితాల దృష్ట్యా ప్రజలు గ్రామాల్లో ఎలాంటి నేరాలకు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని, ఎవరైనా అలా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి జాతర

సంబేపల్లె, మే 22: శెట్టిపల్లె గ్రామం నరసారెడ్డిగారిపల్లె సమీపంలో పాలకొండ వీరాంజనేయస్వామి జాతర బుధవారం వైభవంగా చేపట్టారు. జాతర మహోత్సవానికి చుట్టుపక్కల ప్రజలు విశేషంగా పాల్గొని.. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు చాందినీ బండి కట్టి ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. ఆలయ కార్య నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను చేపట్టారు.

26 నుంచి గ్రామ దేవతల తిరుణాల

సుండుపల్లె, మే 22: మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికి సమీపంలో నిర్మించిన ఆలయంలో గ్రామ దేవతలు మారెమ్మ, కాళికాదేవిల తిరుణాల నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 26వ తేదీ ఉదయం 8 గంటలకు మహాగణపతిపూజ అమ్మవారికి అభిషేకాలు, 27వ తేదీ ఉదయం 9 గంటలకు కలశస్థాపన, నవగ్రహ పూజలు, అమ్మవార్లకు అభిషేకం, హోమం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే రోజు రాత్రి చాందినీబండ్లు దర్శనం ఇవ్వనున్నాయి.

ఘనంగా ముగిసిన చిన్నగంగమ్మ జాతర



పూజలందుకుంటున్న అమ్మవారు

వీరబల్లి, మే 22: మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీలో వెలిసిన చిన్నగంగమ్మ జాతర ఘనంగా ముగిసింది. బుధవారం ఉదయం అమ్మవారికి చల్ల కార్యక్రమం నిర్వహించారు. గుడి, ఆలయం చుట్టుపక్కల చక్కని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొక్కుబడి ఉన్న వారు చాందినీ బండ్లు కట్టి జంతుబలులు ఇచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. చాందినీబండ్ల వద్ద వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజలను అలరింపజేశారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ తిరుణాల

సిద్దవటం, మే 22: మండలంలోని మాచుపల్లి గ్రామ పంచాయతీలో వెలిసిన రేణుకా ఎల్లమాంబ అమ్మవారి తిరుణాల గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23న వైశాఖ శుద్ధ పౌర్ణమి గురువారం తెల్లవారు జామున ధ్వజారోహణం, అంకురార్పణ, 24న సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవం, 25న అమ్మవారి కల్యాణం, సింహాసనంపై అమ్మవారి ఊరేగింపు వుంటుందన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తిమృతి



ఒంటిమిట్ట, మే 22: మండల పరిధిలోని స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, రైల్వే సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడు స్థానికుడా లేక ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చాడా అనే దానిపై రైల్వే పోలీసులతో కలిసి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

పుల్లంపేట, మే 22: మండల పరిధిలోని రామక్కపల్లె సమీపంలో ఆగి వున్న స్కూటర్‌ను మరో స్కూటర్ ఢీ కొనడంతో ఇరువురు గాయపడ్డారు. రైల్వేకోడూరులో పశువుల ఆసుపత్రిలో పనిచేస్తున్న జనార్దన్ తన స్వగ్రామమైన రాజంపేట మండలం దనాసుపల్లెకు వెళ్తూ రోడ్డు పక్కన ఆగాడు. అదే సమయంలో రైల్వేకోడూరు నుంచి నందలూరుకు వెళ్తున్న హుసేన్, అతని స్నేహితుడు మోటార్ బైక్‌లో వచ్చి ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో హుసేన్, జనార్దన్‌లు గాయపడ్డారు. 108 వాహనంలో వారిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నరక ప్రయాణం

- నాలుగేళ్లుగా సాగుతున్న రోడ్డు పనులు
- కొత్తపల్లి అగ్రహారం రోడ్డు పూర్తయ్యేదెన్నడో...
- కంకర తేలిన రోడ్డుపై గ్రామస్థుల అవస్థలు



కొత్తపల్లి అగ్రహారం రోడ్డులో కంకర పరిచి వదిలేసిన దృశ్యం



అసంపూర్తిగా కల్వర్టు నిర్మాణం

పుల్లంపేట, మే 22: పేరుగొప్ప ఊరుదిబ్బ అన్నచందంగా తయారైంది కొత్తపల్లి అగ్రహారం పరిస్థితి. పేరులో కొత్తపల్లి ఉన్నా.. ఎన్నో ఏళ్లుగా సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రోడ్డు సమస్యతో ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. గ్రామంలో సుమారు 70 కుటుంబాలవారు నివశిస్తున్నారు. వీరంతా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరు ప్రతి రోజు మండల కేంద్రానికి వచ్చి వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

పుల్లంపేట మండల కేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలోనే కొత్తపల్లె గ్రామం ఉంది. ఎన్నికల సమ యంలో రాజకీయ నాయకులు గ్రామాన్ని సందర్శించి నపుడు గ్రామంలోని సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడ రు. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పుల్లంపేట నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షం వచ్చినపుడు రాకపోకలు సాగేందుకు వీలుపడదు. అడుగు తీస్తే అడుగు వేయలేని పరిస్థితి. వర్షం పడినప్పుడల్లా ఇక్కడి ప్రజల అవస్థలు వర్ణనాతీతం. నాలుగేళ్ల క్రితం తారు రోడ్డు మంజూరైంది. రోడ్డుపై కంకర పరిచారు. కల్వర్టు పని ప్రారంభించారు. అంతలోనే కాంట్రాక్టరు పనులు ఆపేశాడు. బిల్లులు ఆలస్యం కావడంతో నష్టం వస్తుందని పనులు చేపట్టలేదు. దీంతో కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే కొత్తపల్లి వాసులు కష్టాలు రెట్టింపయ్యాయి. అధికారులకు మొరపెట్టుకోవడంతో రాజంపేట సబ్ కలెక్టర్‌గా ఉన్న ఫర్మాన్ అహమ్మద్ గ్రామాన్ని సందర్శించి ప్రజల కష్టాలు స్వయంగా తెలుసుకొని రోడ్డు పని పూర్తి చేయాలని ఆదేశించారు. వెంటనే పనులు ప్రారంభమయ్యాయి. ఉండేకొద్ది పనులకు నత్తకన్ననయంగా మారాయి. చివరన రోడ్డుపై కంకరవేసి అలా వదిలేశారు. ఇక తారురోడ్డు ఎప్పుడు పూర్తవుతుందో.. కొత్తపల్లి వాసుల కష్టాలు ఎప్పుడు తీరుతాయో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్రరావు

గాలివీడు, మే 22: చట్టానికి అందరూ సమానులేనని... ధనిక, పేద అనే తారతమ్యం ఉండదని.. చట్టానికి లోబడి నడుచుకోవాలని.. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన సాధరణ ఎన్నికల్లో అందరి సహకారంతో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. అలాగే జూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజు వరకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని.. గ్రామాల్లో పార్టీల నాయకులు ప్రజలను రెచ్చగొట్టే వాఖ్యలు చేయకూడదని తెలిపారు. కక్షలకు, కార్పణ్యాలకు వెళితే మీ జీవితాలు ప్రమాదంలో పడతాయన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి గొడవలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి పెద్దలు చేసే తప్పిదాలకు చదువుకుంటున్న పిల్లలు భవిష్యత్తు కూడా నాశనం అవుతుందని హెచ్చరించారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ రోజు ఎవరూ కూడా కౌంటింగ్ కేంద్రాలకు రావద్దని అక్కడ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అన్ని పార్టీల నాయకులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని.. ఎవరు గెలిచినా అందరూ కలిసికట్టుగా మీ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి సహకరించుకోవాలని సూచించారు. లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన గంగాధరబాబు, ఎస్ఐ వెంకటప్రసాద్, ఏఎస్ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం



పుల్లంపేటలో లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

పుల్లంపేట, మే 22: పుల్లంపేట శ్రీరాముల మిట్టలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీరాముల మిట్టలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్న దానం నిర్వహించారు. పుల్లంపేటలో షిరిడీసాయిబాబా ఆలయంలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం కోలాటాలమధ్య స్వామివారి గ్రామో త్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

రైల్వేకోడూరు(రూరల్): మండలంలోని రెడ్డివారి పల్లె పంచాయతీ పరిధిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు స్వామికి స్వామి వారికి అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త పంద్రా నరసింహులు, అర్చకులు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : గోపగుడిపల్లె పంచాయతీలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే గణపతిపూజ నిర్వహించారు. మహిళా భక్తులు అభిషేకాలు చేశారు.

అల్లరి మూకలను ఎదుర్కోవడంపై పోలీసులకు శిక్షణ



పోలీసు సిబ్బందికి మెళుకువలు నేర్పుతున్న దృశ్యం, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ రమాకాంత్

రాజంపేటటౌన్, మే 22: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలుచోట్ల అల్లరి మూకలు చెలరేగిపోయారు. అల్లరి మూకలను ఎలా ఎదుర్కోవాలి అనే కోణంలో పోలీసుశాఖ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం మండల పరిధిలోని రాజంపేట డీఎస్పీ చైతన్య, ఆర్ఐ శ్రీనివాసులు, రూరల్ సీఐ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలవేళ జరిగిన అల్లర్లు, ఓట్లు లెక్కింపు అనంతరం అల్లర్లు జరుగుతాయన్న ఇంటెలిజెన్సీ హెచ్చరికల నేపథ్యంలో పోలీసు సిబ్బందికి పలు విషయాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ బాబు, ఎస్ఐ నాయక్, ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

సిద్దవటం, మే 22 : జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపధ్యంలో అల్లర్లకు, గొడవలకు పాల్పడితే.. అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని కడప దిశ డీఎస్పీ రమాకాంత్ తెలిపారు. సిద్దవటం పోలీ స్టేషన్‌లో బుధవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ ఆదేశాల మేరకు మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో వుంటుందని.. ఎవరూ గొడవల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఎస్ఐ పెద్ద ఓబన్న, పోలీసులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఒంటిమిట్ట, మే 22: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో కౌంటింగ్ సమయం దగ్గర పడటంతో సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న డీఎస్పీ రమాకాంత్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లుగా నమోదైన వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున స్వచ్ఛందంగా రౌడీషీటర్లు పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూధన్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించి.. పర్యావరణాన్ని కాపాడుదాం



బంజరు భూముల్లో మొక్కలు నాటుతున్న దృశ్యం

రామాపురం, మే 22: జీవ వైవిధ్యాన్ని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని జీవ వైవిధ్య పరిరక్షణ అవార్డు గ్రహీత సూరం శ్రీదేవి అన్నారు. ఆమె ప్రపంచ జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని వ్యవసాయానికి పనికిరాని బీడు భూములు, బంజరు భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ మను గడకు జీవనాధారం మొక్కలే అని.. మొక్కలు లేనిదే మానవ జీవితం కడు దుర్భరం అవుతుందన్నారు. మొక్కలు విరివిగా నాటడం వల్ల జీవకోటికి ప్రాణవాయువు పుష్కలంగా లభిస్తుంద న్నారు. ప్రకృతి విపత్తులకు కారణం జీవ వైవిధ్యంలో తేడా రావడం వలననే, సునామీలు, భూకంపాలు, ఎల్‌నినో, ఓజోన్ పొర దెబ్బతినడం లాంటివి జరిగి పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, గుట్టలు, కొండలు, వాగులు, వంకలు వద్ద మనిషికొక చెట్టు, ఊరికి ఒక వనంలాగా తీర్చిదిద్దినప్పుడే జీవనశైలి బాగుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ సూరం వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటి టౌన్, మే 22: జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని 23 పరీక్షా కేంద్రాల్లో జరుగుతాయని, పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 5,338 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30 గంటలలోపల చేరుకోవాలన్నారు. 9.30 గంటల తర్వాత వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కావున పరీక్షా కేంద్రానికి దగ్గరలో ఉండే జిరాక్స్ సెంటర్స్ కూడా మూసివేయాలన్నారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు అస్వస్థతకు గురైతే అక్కడ ఉండే వైద్యశాఖ సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఆయన సూచించారు.

స్వచ్ఛ కోడూరు కోసం ప్రతి ఒక్కరు సహకరించాలి

రైల్వేకోడూరు(రూరల్) మే 22: స్వచ్ఛ కోడూరు కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని సర్పంచ్ బుడిగి శివయ్య, ఉపసర్పంచ్ తోట శివసాయి కోరారు. బుధవారం పట్టణం లోని పంచాయతీ కార్యాలయంలో తోపుడు బండ్ల వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ తోపుడు బండ్ల వ్యాపారస్తులు కచ్చితంగా బండి వద్ద చెత్తబుట్టను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించవలసినదిగా కోరారు. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకులు టెస్టింగ్ సాల్ట్‌ను వాడుకూడదని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టెస్టింగ్ సాల్ట్ వల్ల జరిగే అనర్థాలను వ్యాపారస్తులకు వివరించారు. స్వచ్ఛ కోడూరుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు గ్రామపంచాయతీకి సహకరించాలని కోరారు. అనంతరం చిరు వ్యాపారులు చెత్త వేసుకునేందుకు పాలిథిన్ కవర్లను అందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ల వద్ద మోసాలు జరుగుతున్నాయి

- డీలర్ల సంఘం అధ్యక్షుడు కలెక్టర్‌కు ఫిర్యాదు

రాజంపేట, మే 22: నిత్యావసర సరుకులు అందజేసే స్టాక్ పాయింట్ల వద్ద సరుకులు తూకం వేయడంలో మోసాలు జరుగుతున్నాయని, వెంటనే అరికట్టాలని డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధీర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్టాకు పాయింట్ల వద్ద డీలర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పౌర సరఫరాల కమిషనర్ స్టాకు పాయింట్ల వద్దకు వెళ్లి డీలర్లు సరుకులను తూకం వేయించుకుని తీసుకెళ్లాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ఏ ఒక్క స్టాక్ పాయింట్‌లో ఈ ఆదేశాలను పాటించడం లేదన్నారు. స్టాకు పాయింట్‌లో ప్రతినెల 30వ తేదీ వరకు స్టాక్ రిలీజ్ చేయరన్నారు. ఇదే సమయంలో ట్రాన్స్‌పోర్టు ఎలా చేస్తారో కూడా అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ అతంటిపికేషన్ చేయించి డీలర్లకు సరు కులను పంపిణీ చేస్తే ఇబ్బందులు ఉండవన్నారు. నెలాఖరు 30న సరుకులిచ్చి తీసు కెళ్లమంటూ 15 రోజుల వరకు కూడా పంపిణీ అంశం జరగదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సరుకుల పంపిణీలో మోసాలు లేకుండా చూడాలని కోరారు.

క్రీడా స్ఫూర్తిని కలిగి వుండాలి



మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ ట్రోఫీని అందుకుంటున్న ఎస్ఐ

నందలూరు, మే 22: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి వుండాలని రాజంపేట డీఎస్పీ వీఎస్‌కే చైతన్య పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంటను బుధవారం ఆయన ప్రారంభించారు. ఉదయం ప్రెస్ లెవెన్స్, పోలీసు జట్టు మధ్య జరిగిన మ్యాచ్‌లో పోలీసు జట్టు విజయం సాధించింది. ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ 49పరుగులు చేయడంతో పాటు, రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ట్రోఫీని అందుకున్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

రాజంపేట- రాయచోటి బస్సులు కలెక్టరేట్ మీదుగా నడపాలి

రాజంపేట, మే 22 : రాజంపేట నుంచి రాయచోటికి వెళ్లే బస్సులను కలెక్టరేట్ మీదుగా నడపాలని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ గుల్జార్‌బాషా డిమాండు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిత్యం రాజంపేట నుంచి రాయచోటికి కలెక్టరేట్‌కు వందలాది మంది వెళ్తుంటారన్నారు. ఈ బస్సులు కలెక్టరేట్ మీదుగా వెళ్తే ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా వుంటుందన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండుకు వెళ్తున్నాయన్నారు. తిరిగి ఆర్టీసి బస్టాండు నుంచి కలెక్టరేట్‌కు వెళ్లాలంటే అదనపు సమ యంతో పాటు ఆటో చార్జీలు భారం అవుతున్నాయన్నారు. రాజంపేట నుంచి కలెక్టరేట్ మీదుగా బస్సులను నడిపితే ప్రయాణం సులభతరంగా ఉంటుందని... ఈ విషయమై ఆర్టీసీ ఆర్ఎం, డీఎంతోనూ చర్చించానని తెలిపారు.

చిట్వేలికి జూనియర్ కళాశాల మంజూరు

చిట్వేలి, మే 22 : చిట్వేలి మండల ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. పీఎంశ్రీ పథకం కింద చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగేలా జూనియర్ కళాశాల మంజూరు చేసినట్లు ఎంఈవో కోదండనాయుడు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలను ప్రాంతీయ వ్యాయామ విద్యా సంచాలకులు భాను మూర్తిరాజుతో కలిసి అధికారులు ఆవిష్కరించారు. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ కోర్సులో ఒక్కో గ్రూపుకు 40 సీట్లు మాత్రమే మంజూరు అయ్యాయని తెలిపారు. జూనియర్ కళాశాల మంజూరు పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ఘనంగా ప్రారంభమైన కాలభైరవ స్వామి తిరుణాల



ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి మూలవిరాట్, ఆలయంలో కలశ ఆరాధన పూజలు చేస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, మే 22: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని యండపల్లె గ్రామం మునసల్‌రెడ్డిగారిపల్లెకు సమీపంలో భైరవగుట్టపై వెలిసిన కాలభైరవస్వామి తిరుణాల మహోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్న కాలభైరవస్వామి తిరుణాలలో భాగంగా తొలిరోజు బుధవారం ఉదయం 6 గటలకు గణపతిపూజ, గోపూజ, కాలభైరవస్వామికి అభిషేకాలు, మహామంగళహారతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 8 గంటలకు కాలభైరవస్వామి రుద్రహోమాన్ని ఘనంగా చేపట్టి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కాలభైరవ స్వామికి అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుంద రంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనం తరం శ్రీశైలంలో అలంకరణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప శివలింగం ఆకారంలో 17 అడుగుల శివలింగాన్ని భైరవ గుట్టపై నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ శివలింగంపై కార్తీకమాసంలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అర్చకులు తెలియ జేశారు. అలాగే గురు, శుక్రవారాల్లో కూడా భైరవగుట్టపై వెలిసిన కాలభైరవస్వామి ఆలయం వద్ద తిరుణాల ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి.

నేటి నుంచి గంగమ్మ తిరుణాల

పెనగలూరు, మే 22 : మండలంలోని సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో గల కంబాలకుంట గ్రామంలో గురువారం నుంచి గంగమ్మ తిరుణాల జరుగనుందని గ్రామ స్తులు తెలిపారు. గంగమ్మ జాతర కోసం 60 ఏళ్ల నాటి పోతుల రాజు విగ్రహం శిథిలావస్థకు చేరడంతో శెట్టిగుంట కళాకారుల ద్వారా విగ్రహాన్ని రూ.30వేలతో తయారు చేయించారు. గురువారం రాత్రి పుర వీధులలో పోతుల రాజు, బలిపోతు, మాతమ్మ ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. శుక్రవారం సంగీత కచ్చేరి, శనివారం రాత్రి మారెమ్మ, మాతమ్మ, గంగమ్మ నూతన ప్రతిమలతో గ్రామోత్సవం జరుగుతుంది. ఆదివారం తెల్లవారు నుంచి గ్రామంలోని అన్ని వీధులలో అమ్మవార్లకు జంతు బలిదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆదివారం సాయంత్రం గంగమ్మ తల్లి పార్వేట, జల్ది కార్యక్రమాలతో గంగమ్మ జాతర ముగుస్తుందని తెలిపారు. ఇదిలా వుంగా 63 సంవత్సరాల తరువాత గంగమ్మ జాతర జరుగుతుండటంతో అన్ని వీధులలో దీప కాంతులు, అమ్మవారి కటౌట్లతో దేదీప్యా మానంగా కంబాలకుంట గ్రామం ప్రకాశవంతంగా కనిపిస్తోంది. కాగా, గంగమ్మ జాతర చివరి రోజు ఉత్సవాలు ముగిసిన తరువాత గంగమ్మతల్లి రథంపై యుద్ధానికి బయలుదేరే సన్నివేశం కోసం ప్రత్యేక రథనాన్ని చేసి సిద్ధంగా వుంచారు.



స్వామి దర్శనార్థం క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకంలో భక్తుల రద్దీ

ఐరాల(కాణిపాకం), మే 22: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటికిటలాడింది. స్వామి దర్శనార్థం జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయానికంతా క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయాధికారులు చర్యలు తీసుకున్నారు.

నేటినుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), మే 22: ఖరీఫ్ సీజన్‌కు గాను జిల్లాలో గురువారం నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. 38,655 క్వింటాళ్ల విత్తనాలు ఆర్బీకేల ద్వారా 40 శాతం సబ్సిడీతో జిల్లాలోని 502 రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నారు. కే6 రకం బస్తా (30 కిలోలు) పూర్తి ధర రూ.1,710 కాగా, రాయితీ రూ.684 పోను, రైతు వాటా కింద రూ.1,026 చెల్లించాల్సి ఉంది. నారాయణి రకం బస్తా (30 కిలోల) పూర్తి ధర రూ.1,746 కాగా, రాయితీ రూ.698 పోను, రైతు వాటా కింద రూ.1,048 చెల్లించాలి. కౌలు, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. రైతులు ఇప్పటికే ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న విషయం తెలిసిందే.

11 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 22: జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉదయం 8 నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు 11 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. చిత్తూరులో 22.0మి.మీ, గంగాధరనెల్లూరు 13.0, కార్వేటినగరం 8.2, నగరి 6.4, పుంగనూరు 4.4, పెద్దపంజాణి 4.2, గుడిపాల 4.2, శ్రీరంగరాజపురం 3.8, యాదమరి 3.2, రామకుప్పం 2.4, పులిచెర్ల 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మేనెల సాధారణ వర్షపాతం 67.2 మి.మీ కాగా, బుధవారం నాటికి 103.3 మి.మీ నమోదైంది.

సమన్వయంతో ఇంటర్, టెన్త్ పరీక్షలు

● డీఆర్వో పుల్లయ్య



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, మే 22: ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను అధికారులు సమన్వయంతో సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య ఆదేశించారు. బుధవారం ఆయన పరీక్షల నిర్వహణపై అధికారులతో డీఆర్వో ఛాంబర్‌లో సమావేశమయ్యారు. ఇంటర్ పరీక్షలు జరిగే 31 కేంద్రాల్లో 10,019 మంది విద్యార్థులు రాయనున్నారని, ఇందులో మొదటి సంవత్సరం 7,442మంది, ద్వితీయ సంవత్సరం 2,577 మంది ఉన్నారని వెల్లడించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 15 కేంద్రాల్లో 1,302 మంది బాలురు, 757 మంది బాలికలు హాజరౌతున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యమూ లేకుండా చూడాలన్నారు. ఆర్ఐవో సయ్యద్ మౌలా, డీఈవో దేవరాజులు, వైద్యశాఖ అధికారిణి శిరీష తదితరులు పాల్గొన్నారు.

టపాకాయల గోడౌన్లకు సీల్

● కౌంటింగ్ వరకు విక్రయాలు జరపరాదని ఈసీ ఆదేశం



గోడౌన్‌కు సీల్ వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిత్తూరు రూరల్, మే 22: రాష్ట్రంలో ఎన్నికల తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యం లో కౌంటింగ్ వరకు టపాకాయలు, పెట్రోల్ బాటిళ్లలో విక్రయించరాదని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. చిత్తూరు తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి టపాకాయల గోడౌన్లు, పెట్రోల్ బంకుల యజమానులతో సమావేశమై జూన్ 4వ తేదీ వరకు ఈ నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మురకంబట్టులోని నాలుగు టపాకాయల గోడౌన్‌లకు జేసీ శ్రీనివాసులు ఆదేశాలతో సీల్ చేశారు. సమావేశంలో డీటీ కిరణ్, ఆర్.సంతోష్ పాల్గొన్నారు.

పోలీసులూ.. ఇదేమి తీరు!

● చిత్తూరు జాతరలో అడుగడుగునా ఆంక్షలు
● గుండెపోటు వచ్చినా ట్రాఫిక్ క్లియర్ చేయని వైనం
● ఆస్పత్రి వద్ద ఆటోను ఆపి.. పంపడంతో మరింత ఆలస్యం
● అప్పటికే మృతిచెందిన భక్తుడు







ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు - గుండెపోటు వచ్చిన వ్యక్తిని ఆటోలో తీసుకెళుతున్న స్థానికులు - స్ట్రెచర్‌పై తీసుకెళుతున్న బంధువులు

చిత్తూరు, మే 22: పోలీసులు ఏమాత్రం మానవీయ కోణాన్ని చూపలేదు. గంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తుడు.. గుండెపోటుతో రోడ్డుపై పడిపోగా.. సత్వరం ఆస్పత్రికి తీసుకెళ్లడానికి చొరవ చూపలేదు. జనాన్ని క్లియర్ చేయకపోవడంతో ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఆలస్యమైంది. అప్పటికే ఆయన అసువులు బాశారు. పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గంగజాతర సందర్భంగా పోలీసులు చిత్తూరులో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. బారికేడ్లు పెట్టి ట్రాఫిక్ మళ్లించారు. అడుగడుగునా బందోబస్తులో ఉన్నారు. కాగా, మిట్టూరుకు చెందిన వెంకటేశ్(50) అమ్మవారిని దర్శించుకోవడానికి చర్చివీధిలో వెళుతుండగా గుండెపోటు వచ్చి కింద పడిపోయారు. స్థానికులంతా అతడి వద్దకు చేరుకుని గుమికూడారు. వెంటనే ఆస్పత్రికి ఆటోలో తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ ప్రాంతంలో డ్యూటీలో ఉన్న పోలీసులెవరూ ఏం జరిగిందని కూడా పట్టించుకోలేదు. కనీసం ఆటో వెళ్లేందుకు ట్రాఫిక్ క్లియర్ చేసివ్వడంలోనూ నిర్లక్ష్యం చూపారు. దీంతో రద్దీలో ఆటో ముందుకు వెళ్లే సరికి ఆలస్యమైంది. మామూలు రోజుల్లో అయితే ఆ సంఘటన స్థలం నుంచి ఆస్పత్రి రెండు మూడు నిమిషాల్లో వెళ్లొచ్చు. జనం విపరీతంగా ఉండటం, ట్రాఫిక్ వల్ల పది నిమిషాలు పట్టింది. ఇక, ఆస్పత్రి వద్ద పెట్టిన బారికేడ్ వద్దా బాధితుడిని తీసుకొస్తున్న ఆటోను ఆపారు. పోలీసులకు వివరించి.. వాళ్ల వదిలేసరికి రెండు నిమిషాలకుపైనే పట్టింది. ఇన్ని అడ్డంకులను దాటుకుని ఆస్పత్రికి వెళ్లారు. అతడిని పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కొంత శ్రద్ధతీసుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేసుంటే బతికేవాడని స్థానికులు అంటున్నారు.

ఆంక్షలతో ఇబ్బందులు

గంగమ్మను దర్శించుకోవడానికి నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుచీ భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దర్గా, ఎంఎస్ఆర్, కోర్టు సమీపం, తదితర ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ మళ్లించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండు నుంచి ఐదారు కిలోమీటర్ల దూరం వెళ్లి బస్సులు ఎక్కాల్సిన వచ్చింది. ఇదే అదనుగా ఆటోవాలాలు మూడింతలు రేట్లు పెంచారు. గ్రామీణ ప్రాంతాల వారైతే కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లారు. ఇక, గంగమ్మ దర్శనార్థం చిన్న పిల్లలను తీసుకొచ్చిన వారంతా కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లేందుకు ఇబ్బందిపడి చాలా మంది వెనక్కి వెళ్లిపోయారు.

శ్రీవారి సేవలో తెలంగాణ సీఎం



తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. సీఎం హోదాలో తొలిసారిగా తన కుటుంబీకులతో కలిసి మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు మనవడి పుట్టెంట్రుకల మొక్కుకుని సమర్పించారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో సామాన్య భక్తుడిలా క్యూలైన్ ద్వారా ఆలయంలోకి 8.30 గంటలకు వెళ్లారు. అనంతరం ఆలయంలోనే సుమారు 45 నిమిషాలు గడిపారు. తిరిగి అతిథిగృహానికి చేరుకుని 9.50గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు.

బీసీవై మహిళా కార్యకర్తపై వైసీపీ నేతల హత్యాయత్నం

● మచ్చుకత్తితో పలుచోట్ల నరకడంతో తీవ్రగాయాలు ● రిమాండులో ఉన్న బాధితురాలి భర్త



చికిత్సపొందుతున్న అంజమ్మ

పుంగనూరు, మే 22: ఇంట్లో భోజనం చేస్తున్న బీసీవై మహిళా కార్యకర్తపై వైసీపీ నేతలు బుధవారం రాత్రి మచ్చుకత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు.. పుంగనూరు మండలం మాగాండ్లపల్లె పంచాయతీ బరిణేపల్లెకు చెందిన పి.శంకర్ బీసీవైపార్టీ కార్యకర్త. రామచంద్రయాదవ్‌కు అనుచరుడు. గతనెల 29వ తేది మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామం ఎర్రాతివారిపల్లెలో బీసీవైపీ అభ్యర్థి రామచంద్రయాదవ్ ఎన్నికల ప్రచారానికి వెళ్లగా వైసీపీ శ్రేణులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో రామచంద్రయాదవ్‌తో పాటు పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఆ కేసులో శంకర్‌ను ఈనెల 19వ తేది పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు చిత్తూరు జైలుకు తరలించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం శంకర్ భార్య పి.అంజమ్మ బరిణేపల్లెకి చెందిన వైసీపీ నేత చంద్రశేఖర్‌తో మాట్లాడుతూ తనభర్తపై అక్రమంగా కేసుపెట్టి ఎందుకు అరెస్టు చేయించారని, ఆయన సదుంకే వెళ్లలేదని నిలదీశారు. దీంతో చంద్రశేఖర్, అతడి సోదరుడు పురుషోత్తం మరికొందరు కలిసి రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో భోజనం చేస్తున్న అంజమ్మపై దాడి చేశారు. మచ్చుకత్తితో మెడ, వీపు, ఎడమచేయి, తొడమీద నరకడంతో గాయపడ్డారు. ఆ సమయంలో ఇంట్లో వృద్ధురాలు, అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్న అత్త లక్ష్మక్క మాత్రమే ఉన్నారు. పిల్లలు సెలవులకు బంధువుల ఇంటికి వెళ్లారు. తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో ఉన్న అంజమ్మను గ్రామస్తులు, బంధువులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పుంగనూరు సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ సుబ్బారెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితురాలితో మాట్లాడి, కేసు నమోదు చేశారు. ఈ దాడిని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఖండించారు. వచ్చే నెల 4న పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రౌడీరాజ్యం అంతంకావడం తథ్యమన్నారు.

పుంగనూరు ఎద్దుల పరుషలో ఇష్టారాజ్యంగా వసూళ్లు!

పుంగనూరు రూరల్, మే 22: పుంగనూరులోని మాణిక్యవరదరాజస్వామి పేరుతో ఏటా పుంగనూరు మఠంగడ్డలో ఎద్దుల పరుష (ఎద్దుల సంత) నిర్వహిస్తారు. బుధవారం నిర్వహించిన పరుషకు సంబంధించి రైతులు, వ్యాపారుల నుంచి ఇష్టారాజ్యంగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఎద్దుల సంత నిర్వహించేందుకు అధికారులు బహిరంగవేలం వేసి.. వచ్చిన డబ్బును ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తారు. ఈ క్రమంలో ఎద్దుల పరుషను వేలంలో పాడిన కాంట్రాక్టర్ ఒక్కో పశువుకు రూ.25 టిక్కెట్ వసూలు చేయాలి. కానీ, రూ.50 వంతున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లారీల్లో బయట ప్రాంతాలకు తరలించే పశువులకు సెస్సు మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులలో వసూలు చేయాలి. కానీ, కాంట్రాక్టర్రే రవాణాకు సైతం నకిలీ రసీదులిచ్చి ఒక్కో ఆవుకు రూ.200 చొప్పున.. లారీకి రూ.2వేలు వసూళ్లు చేసి పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై మార్కెట్‌కమిటీ అధికారులు, దేవదాయశాఖ అధికారులు స్పందించడం లేదని రైతులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏఎంసీ కార్యదర్శి గోపిని వివరణ కోరగా సెస్సు మార్కెట్ కమిటీ వారు మాత్రామే వసూళ్ల చేయాలని, నకిలీ రసీదుల విషయంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

జంతు సంరక్షణ నోడల్ అధికారిగా ఏఎస్పీ అరీఫుల్లా



చిత్తూరు, మే 22: జంతు సంరక్షణ చట్టాల అమలు జిల్లా స్థాయి నోడల్ అధికారిగా ఏఎస్పీ అరీఫుల్లాను ప్రభుత్వం నియమించింది. హైకోర్టు ఆదేశాల మేరకు పశువుల, జంతువుల సంరక్షణ చట్టాల అమలుకు ప్రభుత్వం అన్ని జిల్లాలకు నోడ ల్ ఆఫీసర్లను నియమించింది. జంతువుల అక్రమ రవాణా, వధ సమాచారం తెలిస్తే ప్రత్యక్షంగా లేదా ఫోన్ 9440796701, 9440900005 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సబ్సిడీ విత్తన కాయల టోకెన్లు నిలిపివేత

● ఆందోళనలో పుంగనూరు రైతులు

పుంగనూరు, మే 22: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను తక్కువగా కేటాయించింది. దీంతో స్టాకు ఉన్నంత వరకు అధికారులు టోకెన్లు పంపిణీ చేసి నిలిపేయడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పుంగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌కు 12 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను కేటాయించారు. పట్టాదారుపాసుపుస్తకం ఉన్న రైతులకు 40శాతం సబ్సిడీతో ఇస్తామన్నారు. ఈ మేరకు ఆర్బీకే (రైతు భరోసా కేంద్రాల్లో)లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించి టోకెన్లు పంపిణీ చేశారు. ఇలా పుంగనూరు మండలానికి 1950 క్వింటాళ్లు రాగా, 3410 మంది రైతులు టోకెన్లు పొందారు. చౌడేపల్లెలో 1350 క్వింటాళ్లకు 2462 మంది, సోమలలో 1088 క్వింటాళ్లకు 1538 మంది, సదుంలో 890 క్వింటాళ్లకు 264 మంది, పులిచెర్లలో 1099 క్వింటాళ్లకు 1256 మంది, రొంపిచెర్లలో 1100 క్వింటాళ్లకు 789 మంది, గంగవరంలో 1222 క్వింటాళ్లకు 1861 మంది, పెద్దపంజాణిలో 1745 క్వింటాళ్లకు 3498 మంది చొప్పున మొత్తం 12వేల క్వింటాళ్లకు 15,075 మంది రైతులు టోకెన్లు తీసుకున్నారు. పుంగనూరు మండలం భీమగానిపల్లెకు చెందిన రైతులు రమణ, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, గంగులప్ప తదితరులు ఆర్బీకే వద్దకు వెళ్లగా టోకెన్లు నిలిపేసినట్లు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 21, 22 తేదీల్లో ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారన్నారు. తాము 21తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వెళితే, సమయం దాటిపోయిందని, విత్తనకాయలు నిల్వ ఉన్నంతవరకు టోకెన్లు ఇచ్చామని,ఇక, విత్తన కాయలు వస్తేనే రిజిస్టర్ చేసుకుంటామని తెలిపారన్నారు. వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు అవసరం లేకపోయినా టోకన్లు అధికంగా ఇచ్చినట్లు వారు ఆరోపించారు. స్టాకు ఉన్నంతవరకు టోకెన్లు ఇచ్చామని, మళ్లీ విత్తనకాయలు ప్రభుత్వం కేటాయిస్తే రైతులకు ఇస్తామని ఏడీఏ శివకుమార్‌రాజు చెప్పారు. 118 ఆర్బీకేల్లో విత్తనకాయల పంపిణీ జరుగుతుందన్నారు. కొన్నిచోట్ల రైతులకు అవసరం లేకపోతే వాటిని అవసరమున్న ప్రాంతాలకు తరలించి పంపిణీ చేస్తామన్నారు.

గంగమ్మ విశ్వరూపం



● పులకించిన భక్తజనం
● ముగిసిన జాతర



పేరంటాల వేషంలో కైకాల వంశస్తుడు సాంబ

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ విశ్వరూప దర్శనం.. చెంప నరుకుడతో వారం రోజుల గంగజాతర వేడుక ముగిసింది. బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో పేరంటాల వేషం ధరించిన కైకాల వంశస్తుడు సాంబ గంగమ్మకు ఆలయానికి చేరుకున్నాడు. అప్పటికే ఆచారులు విశ్వరూప స్తంభానికి ఎండుగడ్డి, బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారుచేసి ఉంచడంతో భక్తుల అమ్మవారి నామస్మరణల మధ్య పేరంటాల వేషధారి చెంప నరికారు. ఆ ప్రతిమ మన్ను కోసం భక్తులు ఎగబడ్డారు. మన్ను దొరికినవారు ఎంతో పవిత్రంగా ఇంటికి తీసుకెళ్లారు. కాగా, మంగళవారం అర్ధరాత్రి నుంచి కూడా మగవారు ఆడ వేషాలు ధరించి.. డప్పుల వాయిద్యాలతో ఒక్కో వీధి నుంచి బృందాలుగా ఏర్పడి.. చిందులేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు సైతం పూనకంతో ఊగిపోతూ కనిపించారు. ఆలయానికి చేరుకుని వజ్రకిరీటధారి అయిన గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం విశ్వరూప దర్శనం కోసం అక్కడే ఉండిపోయి, దర్శనం చేసుకుని తిరుగుముఖం పట్టారు. దీంతో జాతర మహోత్సవం పరిసమాప్తి అయ్యింది.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I,PEDDAREDDYGARI LAVALEENATHA REDDY (Old Name) R/o. Thondavada, Chandragiri Mandal, Tirupati Dist., A.P., declare that I have changed my surname in my name as PEDDAREDDY LAVALEENATHA REDDY (New Name)
AJT - 3051

CHANGE OF NAME
I,MATTAM HEMASRI W/o VENKATESH SURAGANI R/o 19-3-20/F4/201, S.Z Greens Apartment, Kennedy Nagar, TIRUPATI URBAN, TIRUPATHI Dt,A.P. Hereby submit that MATTAM HEMASRI and MOTTAM HEMASRI both names belongs to me,one and same person.
AJT - 3052

CHANGE OF NAME
I, KOLLURU HYMAVATHI W/o KOLLURU VENKATADRI Residing at THEERTHAM-PADU, AMUDURU, DAKKILI (M) - 524132, TIRUPATI (Dist), A.P. Hence I state that my name has been Changed from KOLLURU HAIMAVATHI (My Old Name) to KOLLURU HYMAVATHI (My New Name)
AJT - 3048

CHANGE OF NAME
I, KOLLURU VENKATADRI S/o KOLLURU SUBBA NAIDU Residing at THEERTHAMPADU, AMUDURU, DAKKILI (M) - 524132, TIRUPATI (Dist), A.P. Hence I state that my mame has been Changed from KOLLURU VENKATRAMAIAH (My Old Name) to KOLLURU VENKATADRI (My New Name)
AJT - 3049

WANTED
తిరుపతిలోని తాహిర్ టెక్స్ అండ్ ఎక్స్ మార్ట్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన క్యాషియర్/సూపర్‌వైజర్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్: 99488 49820
AJT-179597

WANTED
Rtd. Employee /VRS మరియు Qualified సీనియర్ సిటిజన్స్‌కి సువర్ణ అవకాశం. తిరిగి మీ పూర్వ వైభవాన్ని పునర్నిర్మించడం కొరకు సం.ప్ర. KUBER RESIDENCY, TPT. 89784 71248
AJT-3050

TO-LET
TO-LET 3BHK [illegible] తిరుపతి Cell 9848228551.
AJT- 3040

WANTED
S.V. సినిమాస్ (అంబిక థియేటర్, చంద్రగిరి) లో పని చేయుటకు స్టాఫ్ కావలెను. ఫోన్ : 90143 59555
AJT-3037

ప్లాట్స్ ఫర్ సేల్
నేషనల్‌హైవే అనుకొని తిరుపతి IIT, IISEER దగ్గర అయోధ్యా టౌన్ షిప్ నందు అతి తక్కువ ధరకే ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు కలవు. డైరెక్ట్ ఓనర్. 95027 74175, 79959 92114
AJT-3032

ఉద్యోగ అవకాశము
ప్రముఖ రియల్ ఎస్టేట్ నందు మార్కెటింగ్ చేయుటకు APMలు కావలెను. మంచి అవకాశం ఏజన్సీలో వర్క్ చేస్తూ LIC ఏజెంట్స్, అగ్రిగోల్డ్ ఏజెంట్స్‌కి అవకాశం. స్త్రీ,పురుషులకు అవకాశం. వయసు పరిమితి లేదు. సంప్ర.: 9502375369
AJT - 179943

తుడా అప్రూవల్ ప్లాట్స్
సెంట్రల్ / IISRకి ప్రక్కనే తుడా అప్రూవల్‌తో 100 ft. రోడ్డుకి పూర్తి డెవలప్‌తో ప్లాట్స్ 1 అం. 32 వేల నుండి 34 వేలు మాత్రమే మంచి అవకాశం మరలారాదు. వెంకటగిరి రైల్వేస్టేషన్ దగ్గరగా తుడా ప్లాట్స్ కలవు. సంప్ర : 9502375369
AJT - 179942

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 177000

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

అక్రమ బ్లాస్టింగ్‌ను పరిశీలించిన తహసీల్దార్


అమ్మచెరువుమిట్టలో బ్లాస్టింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

మదనపల్లె అర్బన్, మే 22: ఇళ్ల స్థలాలను ఆక్రమించేందుకు వైసీపీ నేతలు ఇళ్ల మధ్యలో బ్లాస్టింగ్ చేస్తున్నారని స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులుగా మదనపల్లె మండలం, కోళ్లబైలు పంచాయతీ, అమ్మచెరువుమిట్టలో ఈబ్లాస్టింగ్ జరుగుతోందన్నారు. స్థానికుల ఫిర్యాదుతో బుధవారం సిబ్బందితో అక్కడికి వెళ్లి బ్లాస్టింగ్‌ను పరిశీలించారు. ఇది ప్రభుత్వ భూమి అని గతంలో ఇక్కడ ఎవరూ ఆక్రమించకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించి దౌర్జన్యంగా బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ఇది ప్రభుత్వ స్థలమని ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరించారు. స్థానికుల ఇళ్లలో ఇబ్బందులు కలుగుతున్నాయని, బ్లాస్టింగ్ వలన తమ ఇళ్లల్లో రాళ్లు పడుతున్నాయని ప్రజలు ఆరోపించినట్లు తహసీల్దార్ చెప్పారు. ఏది ఏమైనా అనుమతులు లేకుండా పత్రాలు లేకుండా ఇళ్ల స్థలాల కోసం చదును చేయడం, బ్లాస్టింగ్‌లు చేయరాదని తెలిపారు. అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

హార్స్‌లీ హిల్స్‌లో పునుగుపిల్లి


కంచెకు చిక్కుకున్న పునుగుపిల్లి

బి.కొత్తకోట, మే22: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్స్‌లీహిల్స్‌లో బుధవారం ఉదయం అరుదైన జాతికి చెందిన పునుగుపిల్లి దర్శనమిచ్చింది. హార్స్‌లీ హిల్స్ ఘాట్‌రోడ్డు అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌కు చిక్కుకుని విలవిల్లాడుతున్న పునుగుపిల్లిని పర్యాటకులు రక్షించారు. ఈ పునుగుపిల్లి అరుదైన జాతికి చెందినది కావడమే కాక దీని దర్శన భాగ్యమే ఒక వరంగా భావిస్తారు. చాలా విశిష్టత కలిగిన ఈ పునుగు పిల్లుల్లో 38 రకాల జాతులు ఉన్నాయని అంటారు. ఈ పిల్లి తైలాన్ని శ్రీవారి అభిషేకాల కు వాడతారని ప్రచారం వుంది. శ్రీగంధం, ఎర్రచందనం చెట్లకు ఈ పునుగుపిల్లి రుద్దినపుడు ఏర్పడే తైలమే పునుగు తైలం అని, ఈ పిల్లి విసర్జించిన గింజలను కాఫీ గింజల తయారీలో వాడతారంటారు. చాలా ఖరీదైన, ప్రాశస్త్యత కలిగిన, అంతరించి పోతున్న అరుదైన పునుగుపిల్లి కనిపించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

80 లీటర్ల నాటుసారా స్వాధీనం


చింతపర్తిలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వాల్మీకిపురం, మే 22: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో వచ్చేనెల 4 వరకు ఎక్కడైనా అల్లర్లకు కారకులైతే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని వాల్మీకిపురం సీఐ పులి శేఖర్ హెచ్చరించారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు చింతపర్తి గ్రామంలో కేంద్ర బలగాలతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని బీసీ కాలనీలో అనిల్‌కుమార్ నుంచి 50లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. అదే కాలనీ వాసి, సారా కేసుల్లో నిందితుడైన ఓంప్రకాష్ ఇంటి పరిసరాల్లో రహస్యంగా దాచిన 30లీటర్ల సారా స్వాధీనం చేసుకోగా ఓంప్రకాష్ పరారయ్యాడు. అనంతరం సీఐ శేఖర్ మాట్లాడుతూ 4 తేదీ జరగనున్న ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా గ్రామాల్లో ప్రశాంతంగా గడపాలని, గొడవలకు పాల్పడడం, ఎన్నికల కౌంటింగ్‌పై బెట్టింగ్‌లు కాయడం చట్టరీత్యా నేరమని అలాంటి వాటికి పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించక క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాటుసారా తయారీ, విక్రయాలు స్వచ్ఛందంగా మానుకోవాలని లేని పక్షంలో పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హజ్‌యాత్రికులకు ఘనంగా వీడ్కోలు


హజ్‌యాత్రికులకు శుభాకాంక్షలు తెలుపుతున్న షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మే 22: మదనపల్లె నుంచి హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద హజ్‌యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన మాట్లాడుతూ.. ముస్లింలకు ఐదు బాధ్యతలు వుంటాయని, వీటిలో హజ్‌యాత్ర వెళ్లిరావడం ఒకటన్నారు. గతంలో మదనపల్లె ప్రాంత హజ్‌యాత్రికులు హైదరాబాద్ నుంచి విమానాల్లో మక్కాకు వెళ్లే వారని, తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడు హజ్‌యాత్రికులు బెంగళూరు విమానాశ్రయం నుంచి వెళ్లేలా ఏర్పాట్లు చేశానన్నారు. ఈ రోజు మదనపల్లె నుంచి మొదటి విడతగా 140 మంది హజ్‌యాత్రకు వెళుతున్నారని, ఈ యాత్రలో వారికి ఎలాంటి కష్టాలు లేకుండా క్షేమంగా వెళ్లి, తిరిగి రావాలని ఆకాంక్షించారు. హజ్‌యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు.

టెన్షన్... టెన్షన్

● తొలుత ములకలచెరువు చివరగా కురబలకోట మండలాల ఓట్లు లెక్కింపు



ములకలచెరువు, మే 22: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతోంది. ఎక్కడ చూసినా ఓట్ల లెక్కింపు, ఏ పార్టీ అధికారంలోకి వస్తుందోనని జోరుగా చర్చోపచర్చలే. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కూడా టెన్షన్ మొదలైంది. 4వతేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నెల 13న జరిగిన పోలింగ్ అనంతరం 14న ఈవీఎంలు జిల్లా కేంద్రం రాయచోటికి చేర్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో జిల్లాలోనే అత్యధికంగా 83.13 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,24,802 మంది ఓటర్లకు 1,86,894 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 92,970, మహిళలు 93,920 మంది, ఇతరులు నలుగురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కురబలకోట మండలంలో 87.80 శాతం, ములకలచెరువులో 76.38, పెద్దతిప్పసముద్రంలో 86.16, తంబళ్లపల్లెలో 83, పెద్దమండ్యంలో 82.41, బి.కొత్తకోటలో 81.97 శాతం పోలింగ్ నమోదైన విషయం విదితమే. తంబళ్లపల్లె నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రం రాయచోటిలో జరగనుంది. దీనికి అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తొలుత ములకలచెరువు మండలం గూడుపల్లె పోలింగ్ కేంద్రం ఈవీఎంలో ఓట్లు లెక్కించనుండగా చివరగా కురబలకోట మండలం అంగళ్లు పోలింగ్ కేంద్రం ఈవీఎంను లెక్కిస్తారు. మొదట ములకలచెరువు, తరువాత తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట మండలాల ఓట్లను లెక్కించనున్నారు.

పెద్దేరుకు కడుపుకోత


ఇసుక తవ్వకాలతో పూడిపోయిన, ధ్వంసమైన పెద్దేరు కాల్వ

● రాత్రిళ్లు తవ్వకాలు - పగలు రవాణా ● బావుల్లా గుంతలు
● ఇష్టానుసారంగా తవ్వకాలతో కాల్వ ధ్వంసం ● ముందుకు సాగని నీరు
● జాతీయ రహదారికి సమీపంలో తీస్తున్నా పట్టించుకునే నాథుడు కరువు

ములకలచెరువు, మే 22: పెద్దేరులో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. ఫలితంగా పెద్దేరుకు కడుపుకోత మిగులుతోంది. రాత్రివేళ ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వకాలు చేపట్టి కుప్పలుగా పోస్తారు. పగలు ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేస్తున్నారు. పెద్దేరులో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వకాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా చేపట్టిన ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాతో పలుచోట్ల పెద్దేరు ధ్వంసమై పూడిపోయింది. పెద్దపాటి గుంతలు ఏర్పడడంతో కాల్వలో నీరు ముందుకు వెళ్లడం లేదు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసినప్పుడు మాత్రమే కాల్వలో నీరు ముందుకు సాగుతున్నాయి. ఐదేళ్లలో పెద్దేరును తోడేసిన ఇసుకాసురులు సొమ్ము చేసుకుంటున్నారు. యంత్రాలు పెట్టి ఇసుకను తోడరాదన్న ప్రభుత్వ నిబంధన ఉన్నా ఇసుకాసురులు లెక్క చేయడం లేదు. కనీసం అనుమతులు కూడా తీసుకోకుండా ఇష్టానుసారంగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెద్దేరు నుంచి రోజూ 50 ట్రాక్టర్ల వరకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి నీరు వందలాది కిలోమీటర్లు ప్రవహించి బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల మీదుగా తంబళ్లపల్లె మండలం పెద్దేరు ప్రాజెక్టుకు చేరుతాయి. కర్ణాటకలో భారీ వర్షాలు కురిసిన సమయంలో పెద్దేరు కాల్వ నీటితో కళకళలాడేది. అయితే ప్రస్తుతం పెద్దేరు ప్రాభవం కోల్పోయింది. ఇష్టానుసారంగా చేపట్టిన ఇసుక తవ్వకాలతో బోసిపోతోంది. ఇసుకాసురుల దెబ్బకు విలవిల్లాడిపోతోంది.

నీరున్నా భారీగా ఇసుక తోడివేత

ఇసుకాసురులు బరి తెగించి పెద్దేరులో ఇసుకను ఇష్టం వచ్చినట్లు తోడేస్తున్నారు. కాల్వలో నీరున్నా వదలడం లేదు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దేరులోని గుంతల్లో నీరు చేరాయి. అయినా అక్రమార్కులు వదలకుండా ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను భారీగా తోడేస్తున్నారు. ముంబై-చెన్నై జాతీయ రహదారికి అతి సమీపంలో ఇసుకను తోడి కుప్పలుగా వేసి ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న పెద్దేరు వంతెన వద్ద మంగళవారం ఇసుకను కుప్పలుగా వేసి ట్రాకర్లతో అక్రమంగా తరలించారు.

కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ...

ఇసుకాసురులు కృత్రిమ డిమాండ్ సృష్టించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దేరు కాల్వ, వాగులు, వంకల్లో నీరు ప్రవహిస్తున్నాయి. దీనిని అదునుగా తీసుకుని ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొరత ఉందని ట్రాక్టర్ ఇసుకను రూ.3 వేల నుంచి రూ.3500 విక్రయిస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడా ప్రభుత్వ ఇసుక రీచ్‌లు లేవు. దీంతో ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇసుకతో ప్రభుత్వానికి ఒక్క పైసా కూడా చెల్లించడం లేదు. డబ్బంతా ఇసుకాసురుల జేబుల్లోకి వెళ్తోంది.

అనుమతులు గాలికొదిలేశారు...

గతంలో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక రవాణా చేసేందుకు మండల స్థాయి అధికారుల అనుమతి తీసుకునేవారు. ఇళ్లు నిర్మించుకునే వారు ఇసుక కోసం మండల స్థాయి అధికారులకు అర్జీ సమర్పించేవారు. దీంతో ఇళ్ల నిర్మాణం కోసం కావాల్సిన ఇసుకను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులు రాత పూర్వకంగా అనుమతి ఇచ్చేవారు. ఈ అనుమతి ఆధారంగా ట్రాక్టర్ యజమానులు ఇసుకను తోలేవారు. దీనికి మంగళం పాడి అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా ఇసుకను తోలి ఇసుకాసురులు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో అధికారులు ట్రాక్టర్ ఇసుకను ఎక్కువ మొత్తానికి తోలకుండా ఒక రేటు నిర్ణయించేవారు. ఇది కూడా అమలు కాకపోవడంతో ఇష్టానుసారంగా అధికంగా ఇసుకను అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై ఎస్ఈబీ సీఐను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా మూడు రోజులుగా తాను సెలవులో ఉన్నట్లు చెప్పారు.

పెద్దేరులో ఇసుక రవాణా అడ్డగింత

- రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు

దేవళచెరువు సమీపంలో పెద్దేరులో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను గ్రామస్థులు అడ్డుకున్నారు. పెద్దేరులో ఉన్న చెక్‌డ్యాం వద్ద భారీగా రోజూ ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో ఇసుకాసురులు తోడేస్తున్నారు. దీంతో చెక్‌డ్యాం పునాదులు కదిలిపోయి ప్రమాద స్థాయికి చేరింది. వర్షం కురిస్తే చెక్‌డ్యాం కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున గ్రామస్థులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. అలాగే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న కూలీలు - తరలించేందుకు కుప్పగా వేసిన ఇసుక

విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

నేటి నుంచి పచ్చిరొట్ట పంపిణీ ● నెలాఖరున సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ ● ఆర్‌బీకేల్లో నమోదు తప్పనిసరి


అధికారులకు సూచనలిస్తున్న మదనపల్లె ఏడీఏ దీక్షాకుమారి

మదనపల్లె టౌన్, మే 22: ఖరీఫ్ సీజన్ ప్రారం భం అవుతోందని, రైతులకు అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లె డివిజన్ వ్యవసాయశాఖ అధికారి దీక్షా కుమారి అన్నారు. కలెక్టర్, డీఏఓ ఆదేశాలతో వేరుశనగ రైతులకు 29,30 తేదీల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఎనిమిది మండలాల ఏఓలు, ఏఈఓల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సన్నకారు రైతులు వారి పేర్లను ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని, ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని రావాలన్నారు. ఎకరా చేనుకు బస్తా(30 కిలోలు), రెండెకరాలు వున్న రైతుకు రెండు బస్తాలు సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు. గురువారం నుంచి పచ్చిరొట్ట (జీలుగ, జనుము) 50శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తామన్నారు. మండల వ్యవసాయ అధికారులు వారి మండలాలకు కేటాయించిన వేరుశనగ విత్తనాల స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వేరుశనగ లాట్‌ల నుంచి రైతుల సమక్షంలో రెండు బస్తాలు దించి, వేరుశనగ విత్తనకాయల జెర్మినేషన్ లెక్కించాలన్నారు. 100 గ్రాముల వేరుశనగ కాయలు వలిస్తే 74 గ్రాముల గింజలు బరువు తూగాలన్నారు. లేని పక్షంలో ఆయా లాట్‌లను వాపసు పంపాలన్నారు. చేలో రైతులు విత్తే విత్తనాలు 70 శాతం మొలకెత్తేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. సాలులో 10 సెంటీమీటర్లు దూరంలో ప్రతి విత్తు వేసేలా, ప్రతి సాలుకు 30 సెంటీమీటర్లు దూరం వుండేలా రైతులకు సూచనలివ్వాలన్నారు. వర్షం పడుతూనే పొలాల్లో లోతు దుక్కులు దున్నడం, వాలుకు అడ్డంగా ఒంటిమడకతో దున్నాలన్నారు. వర్షం నీరు ఈ సాలులో నిల్వ వుండి భూమిలో తేమశాతం నిల్వ వుంటుందన్నారు. ఏఓలు ఝాన్సీలక్ష్మి, ప్రేమలత, సుధారాణి, లీలా, రాధ, మురళీ మోహన్, మోహన్‌కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

1730 క్వింటాళ్లు విత్తనాలు మంజూరు

వేరుశనగ వాల్మీకిపురం, మే 22: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు 1730క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు ప్రభుత్వం కేటాయించిందని ఏఓ హేమలత పేర్కొన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ ఫోన్ తీసుకుని ఆయా పరిధి రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. 30కిలోల కె6, టీసీజీఎస్ వేరుశనగ విత్తనాల బస్తా రూ.1710, నారాయణి బస్తా రూ.1746 ధర నిర్ణయించారన్నారు.

1150 కింటాళ్లు మంజూరు

గుర్రంకొండ, మే 22: మండలానికి 1150 కింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు వచ్చినట్లు ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విత్తనకాయలను ఆయా ఆర్బీకేల్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు. కే6, నారాయణి రకం విత్తనకాయలు వచ్చాయన్నారు. రైతులు విత్తనకాయల కోసం ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రెండు రోజుల్లో రైతులకు సరఫరా చేస్తామన్నారు.

ఆర్బీకేలకు చేరిన విత్తన కాయలు

పెద్దమండ్యం, మే 22: పెద్దమండ్యం మండలం ఆర్బీకేలకు ప్రభుత్వ సబ్సిడీ వేరుశనగ కాయలు చేరినట్లు ఏఓ సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 2800 క్వింటాళ్లు కావాలని ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి..

బి.కొత్తకోట,మే22: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనకాయలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల రైతుభరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. విత్తనకాయలు కావాల్సిన రైతులు ముందస్తుగా డబ్బు చెల్లించి టోకెన్‌లు పొందాలన్నారు. కె6, 1694, టీసీజీఎస్ రకం కాయలు 30కిలోల బస్తా ధర రూ.1710, కదిరి, లేపాక్షి రూ.1566గా ప్రభుత్వం ధర నిర్ణయించినట్లు ఏఓ పేర్కొన్నారు.

కల్ప వృక్ష వాహనంపై శ్రీనివాసుడు విహారం



మదనపల్లె అర్బన్, మే 22: ప్రసన్న వేంకటరమణస్వామి మోహనీ అవతారంలో కల్ప వృక్షవాహనంపై కలియుగదైవం శ్రీనివాసుడు విహరించారు. ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఉదయాన్నే విగ్రహమూర్తులను ఆలయ ప్రధాన అర్చకుడు గోవర్ధన్ ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం కొత్తపేట పరిసరాల్లో శ్రీనివాసుడు కల్పవృక్ష వాహనంపై విహరించారు. పురవీధుల్లో మహిళలు, భక్తులు హారతులు పట్టి కన్నులారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రమణ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

ఘనంగా నరసింహస్వామి జయంత్యుత్సవం


స్వామివారికి స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ, మే 22: తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి జయంత్యుత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు వేదపండితులు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర్ భారతి స్వామి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేయించారు. దాతలు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం



పెద్దమండ్యం, మే 22: పాపేపల్లి ఏకశిల గుట్ట మీద వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం కావడంతో ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. కల్యాణోత్సవాన్ని భక్తులు అధిక సంఖ్యలో తిలకించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఏపీడీ మధుబాబు సూచన


ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ మధుబాబు

తంబళ్లపల్లె, మే 22: మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచి ఎక్కువ మంది కూలీలు పాల్గొనేలా కృషిచేయాలని ఏపీడీ మధుబాబు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యమిచ్చి, ఉపాధిలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని, చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ అంజనప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి


సూచనలిస్తున్న ఎంపీడీఓ పోలప్ప

ములకలచెరువు, మే 22: పని అడిగిన కూలీలందరికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ పోలప్ప సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఖచ్చితంగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాల న్నారు. ఐదెకరాలు ఉన్న ప్రతి రైతుకు హార్టికల్చర్ కింద పండ్ల తోటల సాగుకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పనుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం ములకలచెరువు సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె అర్బన్, మే 22: పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలైకు మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమికి ఆర్టీసీ బస్సుల నడుపుతూ ప్రయాణికుల మన్ననులను పొందుతున్నామని చెప్పారు. అక్కడికి పోనురాను ఒక్కరికి చార్జీ కేవలం రూ. 805 మాత్రమే అన్నారు. ఆర్టీసీలో ప్రయాణం చేసి సుఖవంతంగా స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయండి


విత్తనాల శుద్ధిని పరిశీలిస్తున్న డీఏఓ చంద్రనాయక్

కలకడ, మే 22: ఖరీఫ్‌లో ప్రభుత్వానికి నాణ్యమైన వేరుశనగ విత్తనకాయలను సరఫ రా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ మిల్ యజమానులను ఆదేశించారు. బుధవారం ఆయన కలకడలోని విత్తనశుద్ధి కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనశుద్ధి, తేమ శాతం, మొలక శాతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాణాలు లోపిస్తే విత్తన శుద్ధి కేంద్రాల యజమానులపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్ర మంలో వాల్మీకిపురం ఏడీఏ వాణిశ్రీ, ఎంఏఓ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం - కేసు నమోదు

ములకలచెరువు, మే 22: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక ఆచూకీ కోసం తెలిసిన వారి ఇళ్లలో, బంధువుల దగ్గర వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ చెప్పారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లి, మే 22: గుట్టు చప్పుడు కాకుండా నాటుసారా విక్రేతను అరెస్టు చేసి అతని నుంచి 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ తెలిపారు. రాచవేటివారిపల్లి వాసి పిల్లి నారాయణ కుమారుడు పిల్లి రాజు గ్రామ సమీపంలో ఓ చింత చెట్టు కింద నాటుసారా అమ్ముతుండగా దాడులు చేసి 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజును అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామన్నారు.

నిర్వాహకులు బాధ్యతతో ఉండాలి..


మట్లవారిపల్లె మీ సేవ కేంద్రంలో డీఎల్‌డీఓ

రామసముద్రం, మే 22: మీ సేవా కేంద్రాల నిర్వాహకులు కుల, ఆదాయ, భూమి పాస్ పుస్తకాలు జారీలో బాధ్యతగా వ్యవహరించాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి మీ సేవ నిర్వాహకులకు సూచించారు. పెద్దకురప్పల్లె, మినికి, చెంబకూరు మీ సేవ కేంద్రాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ మీ సేవా ఆపరేటర్లు రైతులు, విద్యార్థులకు షరతులతో సర్టిఫికెట్లు జారీ చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధర తీసుకోవాలన్నారు. రైతుల దగ్గర అధిక రుసుము వసూలు చేయరాదని అలా చేస్తే కఠి న చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డీఎల్‌డీఓ వెంట ఎంపీడీఓ నారాయణ స్వామి, పంచాయతీ సెక్రటరీ భానుమూర్తి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అడ్డదిడ్డంగా స్పీడ్ బ్రేకర్‌లు

వాల్మీకిపురం, మే 22: పట్టణంలో అడ్డదిడ్డంగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బైపాస్ రోడ్డులోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఓ ప్రైవేట్ పాఠశాల ఉంది. అయితే మంగళవారం రాత్రి పాఠశాల ఎదురుగా రోడ్డుపై వేసిన స్పీడ్ బ్రేకర్ల కారణంగా ద్విచకవాహన చోదకులు జారిపడి గాయాలపాలవుతున్నారు. రోడ్డును ఆక్రమించి ఇష్టారాజ్యంగా స్పీడ్‌బ్రేకర్లు వేయడం ఏంటని స్థానికులు సైతం ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని కోరుతున్నారు.